PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 123 | విజయవాడ, గురువారం 5 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 5 December 2024 | Rs

గిరిజన సమగ్ర ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలి

- సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ ప్రారంభంలో వి శ్రీనివాసరావు

3

నేడు టీచర్ ఎంఎల్‌సి ఉప ఎన్నిక

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక పోలింగ్ గురువారం జరగనుంది. మొత్తం 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16,737 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద బుధవారం తొమ్మిది గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు. గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం, ఎటపాక డివిజన్ల పరిధిలో మధ్యాహ్నం రెండు గంటలతోనే పోలింగ్‌ను ముగించనున్నట్లు అధికారులు తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తితోపాటు ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల తొమ్మిదిన కౌంటింగ్ జరగనుంది. కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను 7వ తేదీలోపు సమర్పించాలని ఎఆర్ఒ వెంకటరావు తెలిపారు.

రైతులను ముంచిన 'ఫెంగల్'

ఆరుగాలం కష్టించి పండించిన పంటలపై ఫెంగల్ తుపాను తీవ్ర ప్రభావం చూపింది. రైతులను నిండా ముంచింది. వర్షాలకు వరి చేలు ఒరిగిపోయాయి. కోసి ఆరబెట్టిన వరి పనలు తడిచిపోయాయి. కళ్లాల్లోనూ, రోడ్లపైనా ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిచి ముద్దయ్యాయి. దీంతో, ధాన్యం రంగు మారే, మొలకలు వచ్చే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. పలు జిల్లాల్లో వరి పొలాలు ఇంకా వరద నీటి ముంపులోనే ఉన్నాయి.

-ప్రజాశక్తి, యంత్రాంగం




కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పడుతున్న అవస్థలు

తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గోదావరి నదీ పరివాహక ప్రాంతంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో బుధవారం స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. ఉదయం 7.27 గంటల ప్రాంతంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. హైదరాబాద్‌కు వాయువ్య దిశలో 218 కిలోమీటర్ల దూరంలో, విజయవాడకు ఉత్తర దిశలో 212 కిలోమీటర్ల దూరంలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైనట్టు హైదరాబాద్‌లోని జాతీయ భూ భౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జిఆర్‌ఐ) శాస్త్రవేత్తలు వెల్లడించారు. నదీ పరివాహక ప్రాంతంలో భూమి లోపల పగుళ్ల వల్ల సర్దుబాటు జరుగుతుందని, ఆ సమయంలో ప్రకంపనలు రావడం సర్వసాధారణమని తెలిపారు. మేడారం వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించామని, భూమికి 40 కి.మీ లోతులో ప్రకంపనలు వచ్చాయని, భూకంప కేంద్రం ఎక్కువ లోతులో ఉన్నందున ప్రకంపనల తీవ్రత తక్కువగా ఉందని తెలంగాణ విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తెలిపారు.



తెలంగాణ రాష్ట్రం హనుమకొండలో భయంతో ఇళ్ల నుండి బయటకు వచ్చిన ప్రజలు

సెకి ఒప్పందంపై ఆలోచిస్తున్నాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి)తో విద్యుత్ పంపిణీ సంస్థలు చేసుకున్న ఒప్పందాన్ని ఏం చేయాలన్న విషయమై ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కుదిరిన విద్యుత్ ఒప్పందాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారని విలేకరులు అడగగా ఏం చేయాలో ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకసారి కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేయాలంటే జరిమానా కట్టాల్సి ఉందన్నారు. అన్ని వైపుల నుంచి ఏది మంచి అనేది బేరీజు వేస్తున్నామని తెలిపారు. అయితే అదాని-సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకునేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ కేంద్ర మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇటీవల లేఖ రాశారు. అదాని సెకి ఒప్పందంలో కొన్ని క్లాజ్‌ల కింద, ప్లాంట్ యాజమాన్యాలు ముడుపులు చెల్లించిన విషయాల ఆధారంగా, ఫోర్స్ మేజర్ కింద ప్రభుత్వానికి ఒప్పందాన్ని రద్దు చేసే అవకాశం ఉందని ఆయన లేఖలో వివరించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సిబిఐ, ఇడి, సిబిడిటిలతో కేంద్రం దర్యాప్తు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కోరాలని, కేంద్రం

మిగతా 2లో



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న చంద్రబాబు

నిర్బంధాన్ని ఎదిరించి మళ్లీ రోడ్డెక్కిన యుపి రైతులు

- ఢిల్లీ సరిహద్దుల్లో బైఠాయింపు
- వందలాది మంది అరెస్టు
- రైతుల ఆందోళనతో విడుదల
- పోరు కొనసాగుతుంది: ఎస్‌కెఎం
- యుపి ప్రభుత్వ అణచివేత చర్యలకు ఖండన

ప్రజాశక్తి న్యూఢిల్లీ బ్యూరో

న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లోని పచ్చి మితవాద బిజెపి ప్రభుత్వం ఎంతగా నిర్బంధాన్ని ప్రయోగించినప్పటికీ వాటన్నిటిని అధిగమించి వేలాది మంది రైతులు బుధవారం ఢిల్లీ సరిహద్దులకు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు. పట్టణీకరణ, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో తమ నుంచి లాక్కున్న భూములకు పరిహారం చెల్లించడంలో వరుసగా ప్రభుత్వాల వైఫల్యంపై ఆగ్రహంతో ఉన్న రైతులు బుధవారం గ్రేటర్ నోయిడాలోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై జీరో పాయింట్ వద్ద భారీ మహాపంచాయత్‌ను నిర్వహించారు. డిమాండ్లన్నీ సాధించే వరకు నోయిడా-ఢిల్లీ హైవేలోని దళిత్ ప్రేరణ స్థల్ వద్ద పగలు, రాత్రి ఆందోళన కొనసాగించాలని మహాపంచాయత్ నిర్ణయించింది. శాంతియుతంగా నిరసన తెలిపే వారి ప్రాథమిక హక్కును ఉల్లంఘించి మంగళవారం జైలులో పెట్టిన 160 మంది రైతులను విడుదల చేయాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. 16 గంటల తరువాత రైతు నేతలు, రైతులు, మహిళలు విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన రైతు నేతలను భుజాలపైకి ఎక్కించుకుని రైతులు వేదిక వద్దకు తీసుకెళ్లారు. విడుదలైన రైతు నాయకులు రూపేష్ వర్మ, సుఖ్‌బీర్ ఖలీఫా, సునీల్ ఫౌజీ తదితరులు మహాపంచాయత్‌లో ప్రసంగించారు. ఏడు రోజుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చి, దానికి భిన్నంగా రైతులను అరెస్టు చేసి జైలుకు పంపారని వారు విమర్శించారు. రైతులకు అనుకూలంగా 10 శాతం ప్లాట్లు, భూసేకరణ వల్ల కలిగే అన్ని

మిగతా 7లో



ఢిల్లీ సరిహద్దులో యమునా ఎక్స్‌ప్రెస్ హైవేపై బైఠాయించిన రైతులు

'బియ్యం' చిచ్చు!

- జనసేన నేతల నడుమ కోల్డ్‌వార్
- వారి విభేదాలు వాడుకుంటున్న కొందరు టిడిపి నేతలు
- ఎలాగైనా బయటపడే ఎత్తులో వైసిపి నాయకుడు
- మూడు పార్టీల ప్రయోజనాల్లో రైస్ అక్రమాలు మాఫీ
- కేసులు, దర్యాప్తులపై కాలయాపన?



కాకినాడ పోర్టు వద్ద పవన్, నాదెండ్ల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కాకినాడ పోర్టు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం జనసేనలో చిచ్చు పెట్టినట్లు సమాచారం. ఇద్దరు ముఖ్య నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని టిడిపిలోని కొందరు నేతలు తమకనుకూలంగా మార్చుకుంటున్నట్లు ఇరుపార్టీల్లో జోరుగా చర్చ సాగుతోంది. కాగా కూటమిలోని రెండు పార్టీల మధ్య నెలకొన్న విభేదాలను కొన్నేళ్లుగా కాకినాడ పోర్టును తన స్వంత అడ్డాగా మార్చుకొని లక్షల టన్నుల ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు రవాణా చేసిన వైసిపి నేత తాను కేసుల నుంచి బయట పడేందుకు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఆ మూడు పార్టీలకు చెందిన కొందరి స్వార్థ, రాజకీయ ప్రయోజనాల మూలంగానే బియ్యం అక్రమ రవాణాపై సమగ్ర దర్యాప్తు, బియ్యం పట్టుబడిన స్టెల్లా నౌక సీజ్, కేసుల నమోదు, బాధ్యులపై చర్యలు చేపట్టట్లేదని ఆరోపణలొస్తున్నాయి. బియ్యం అక్రమ రవాణాను రాజకీయ విమర్శలకు ఉపయోగించడానికి, వీలైన మేరకు కేసులను తాత్సారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొదలెక్కడంటే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ పోర్టు ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతోందంటూ సమీక్ష చేసి, కొద్ది మొత్తంలో బియ్యాన్ని పట్టుకొని, ఈ వ్యవహారంలో ఆలిండియా సర్వీస్ అధికారుల పాత్ర ఉందని ప్రకటించారు. అనంతరం కొన్ని మాసాల వరకు ఎలాంటి దర్యాప్తు లేదు. ఇటీవల నెల్లూరు పర్యటనలో ఉన్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కు జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు స్టెల్లా నౌక గురించి ఉప్పందించారు. ఆ నౌకను దాటించేస్తారన్న ఆలోచనతో హుటాహుటిన పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టుకు చేరుకొని నౌకలో అక్రమంగా తరలుతున్న బియ్యాన్ని సీజ్ చేయించేందుకు ప్రయత్నించారు. మామూలుగా అయితే తమ పార్టీకి చెందిన నాదెండ్ల మనోహర్ సివిల్ సప్లయిస్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన్ని అప్రమత్తం చేయకుండా పవన్ కళ్యాణే నేరుగా కాకినాడకు వెళ్లడంతో చర్చ మొదలైంది. నాదెండ్లపైనా, సివిల్ సప్లయిస్ అధికారులపై నమ్మకం లేకనే పవన్ నేరుగా రంగంలోకి దిగారనీ చెబుతున్నారు. నాదెండ్ల కావాలనే బియ్యం అక్రమ రవాణాపై సాచివేతగా ఉన్నారని అనుమానించడం వల్లనే పవన్ నేరుగా కార్యరంగంలోకి దిగారని సమాచారం. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాలో కొందరు టిడిపి నేతల ప్రమేయం కూడా ఉందని, వారికి నాదెండ్ల పరోక్షంగా సహకరిస్తున్నారన్న అనుమానం పవన్‌లో ఉందని జనసేన పార్టీలో చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా, వాటాలు కుదరకనే పవన్ కాకినాడకు వెళ్లారన్న

మిగతా 7లో

'పిఎస్‌ఎల్‌వి-సి 59' ప్రయోగం నేటికి వాయిదా

- ఈ నెలలోనే చంద్రయాన్-4 : ఇస్రో చైర్మన్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

ప్రోబో-3 ఉపగ్రహంలో సాంకేతిక లోపాన్ని యూరోపియన్ శాస్త్రవేత్తలు కౌంట్‌డౌన్ సమయంలో గుర్తించారు. దీంతో, శ్రీహరికోట షార్ నుంచి బుధవారం సాయంత్రం 4.08 గంటలకు ప్రయోగించాల్సిన పిఎస్‌ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. గురువారం సాయంత్రం 4.12 గంటలకు తిరిగి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఇది చాలా విశిష్టమైన భారీ ఉపగ్రహ రాకెట్ ప్రయోగమని, సూర్యునిపై ప్రత్యేక పరిశోధనలు చేపట్టడం దీని ప్రధాన ఉద్దేశమని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తెలిపారు. పిఎస్‌ఎల్‌వి సి-60 రాకెట్‌ను ఈ నెలలోనే చంద్రయాన్-4 ప్రయోగానికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గగన్ యాన్ రాకెట్ ప్రయోగానికి కూడా డిసెంబర్ నుండి ఇస్రో హెడ్ క్వార్టర్స్‌లో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

'కడప ఉక్కు'కు కేంద్రం ద్రోహం

- సిపిఎం రాష్ట్రకమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప స్టీల్‌ప్లాంట్ కేంద్రప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి ప్రకటించడాన్ని సిపిఎం రాష్ట్రకమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కడపలో నిర్మించాల్సిన ఉక్కుపరిశ్రమపై కేంద్రమంత్రి ప్రకటన వెనుకబడిన రాయలసీమ ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వంతో సంప్రదించి ప్రభుత్వరంగంనే కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని, రాయలసీమ అభివృద్ధికి 16 డిమాండ్లతో కూడిన రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి 2018 ఫిబ్రవరి 22న కర్నూలులో ప్రకటించిందని తెలిపారు. గత పదేళ్లుగా కడప ఉక్కుపరిశ్రమ నిర్మాణంపై హామీ ఇస్తూ వచ్చిన బిజెపి ఇలా మాటమార్చడం గర్హనీయమని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం దీనిపై తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్‌చేశారు. తెలుగుదేశం, జనసేన పార్టీ మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి మేలు చేయకపోగా తీరని ద్రోహం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. 2007 జూన్ 10న కడప ఉక్కు పరిశ్రమకు మొట్టమొదటిసారి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత చంద్రబాబు 2018లో, జగన్‌మోహన్ రెడ్డి 2019, 2023లలో శంకుస్థాపనలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతం ప్రజలకు ఉపాధితో పాటు, అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసించాలని, దాని సాధనకై ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

- డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి హామీ

2

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

- ఆర్ఆర్ మిశ్రా కమిటీ తర్వాతే డిఎస్సి
- పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులపై రాష్ట్రప్రభుత్వం ఆశలు చల్లుతోంది. ముఖ్యమంత్రిగా తొలిసంతకం చేసిన హామీ ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు కాలేదు. వివిధ కారణాల చెబుతూ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తోంది. నవంబర్ 6వ తేదిన విడుదల చేస్తామని చెప్పినా విడుదల చేయని విషయం తెలిసిందే. తాజాగా ఎస్సి వర్గీకరణపై రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్(ఆర్ఆర్) మిశ్రా కమిటీ నివేదిక వచ్చిన తరువాతే డిఎస్సి నోటిఫికేషన్ ఉంటుందని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు. ఈ నెల 7వ తేదిన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్' కార్యక్రమంపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావులతో కలిసి సచివాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని విలేకర్లు ప్రశ్నించగా ఆర్ఆర్ మిశ్రా కమిషన్ నివేదిక వచ్చిన వెంటనే తమ పని మొదలు పెడతామని ఆయన చెప్పారు. అయితే కమిటీ నివేదిక ఎప్పటికి వస్తుందో తనకు తెలియదని, ఈ అంశం తన పరిధిలో లేదన్నారు. ప్రతి గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రారంభించే అంశంపై చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. 'మనబడి మన భవిష్యత్' కింద చేపట్టిన కార్యక్రమంలో సుమారు రూ.8వేల కోట్ల పనులు నిలిచిపోయాయని చెప్పారు. అవసరం లేని చోట కూడా పనులు నిర్వహించిన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తల్లిదండ్రుల సహకారం, భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 7వ తేదిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఢిల్లీలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించారని, పెద్ద రాష్ట్రాల్లో ఎపిలోనే మొట్టమొదట నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని వెల్లడించారు. ప్రజాప్రతినిధులందరూ కూడా తమకు దగ్గరలో ఉన్న పాఠశాలలో పాల్గొంటారని చెప్పారు.



పంజాబ్‌లో కాల్పుల కలకలం

- శిరోమణి అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ బాదల్‌పై హత్యాయత్నం
- అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద ఘటన

దేవేంద్ర ఫడ్నవిస్‌కే పట్టం

- నేడు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం
- డిప్యూటీ సిఎంలుగా షిండే, అజిత్ పవార్


7

రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు

- సాగునీటి సంఘాల ఎన్నికలపై హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

సాగునీటి సంఘాల మేనేజింగ్ కమిటీల ఎన్నిక సాధ్యం కానప్పడు, ఏకాభిప్రాయం ఏర్పడనప్పుడు రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు ఓటర్లయిన రైతులను అనుమతించాలంది. 'చేతులెత్తి ఎన్నుకునే విధానం'ను అమలు చేస్తే ఓటర్లు ఇబ్బందిపడతారని చెప్పింది. అలాంటప్పుడు వారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఏకాభిప్రాయం కుదరనప్పుడు సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఓటర్లు కోరవచ్చు. కావున ఓటును రహస్యంగా వేసేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలి' అని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. విచారణను జనవరి 25కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. చేతులు ఎత్తి ఎన్నిక నిర్వహించే విధానాన్ని సవాలు చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా, వేములనర్వ గ్రామానికి చెందిన చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కమతం రాములు వేసిన పిటిషన్లలో హైకోర్టు పైవిధంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఓటు విషయంలో తగిన సమయంలో అభ్యంతరం వ్యక్తం చేసే స్వేచ్ఛ పిటిషనర్లు, ఇతర రైతులకు ఉంటుందని చెప్పింది. రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునంది. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది.





మట్టిలో కూరుకుపోయిన గంగన్న, శ్రీదేవి, సంధ్య

ఇంటి పైకప్పలు కూలి ఐదుగురు మృతి

- అనంతపురంలో దంపతులతో పాటు చిన్నారి
- సత్యసాయి జిల్లాలో ఇద్దరు రైతులు

2




అల్లు అర్జున్‌ను చూసేందుకు ఎగబడ్డ అభిమానులు..

తొక్కిసలాటలో మహిళ మృతి

హైదరాబాద్: ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్‌లో 'పుష్ప2' చిత్రం ప్రీమియర్ షో నేపథ్యంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రీమియర్ షో వీక్షించడానికి అల్లు అర్జున్ థియేటర్‌కు రాగా.. ఆయనను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా తోసుకుంటూ ముందుకు రావడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈక్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. దీంతో గాయపడిన రేవతి (39) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలుడు శ్రీతేజ్ (9)కు పోలీసులు సీపీఆర్ చేశారు. అనంతరం బేగంపేట్ కిమ్స్‌కు తరలించారు. థియేటర్ వద్ద దాదాపు 200 మంది పోలీసులు మోహరించారు.

అత్యల్ప స్థాయికి జనాభా వృద్ధి రేటు

- పెరుగుతున్న వయో వృద్ధుల సంఖ్య
- సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనాభా వృద్ధిలో జపాన్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. 2021లో రాష్ట్రంలో జనాభా వృద్ధి రేటు అత్యల్ప స్థాయి 3.5 శాతానికి పడిపోయిందన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే మూడవ వంతుకు పడిపోయిందని తెలిపారు. ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న వారు 49.10 శాతం ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 14 ఏళ్లలోపు చిన్నారులు 20.51 శాతం, 15 నుంచి 59 ఏళ్లలోపు వారు 67.10 శాతం, 60 ఏళ్లు అంత కంటే ఎక్కువ వయసున్నవారు 12.40 శాతంగా ఉందన్నారు. వయోవృద్ధుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని చెప్పారు. 2020కు సంతానోత్పత్తి రేటు జాతీయ సగటు 2.0 ఉంటే ఎపి సగటు 1.5 మాత్రమే ఉందన్నారు. జాతీయ స్థాయి కంటే జననాల రేటు గణనీయంగా తగ్గిందన్నారు. జాతీయ సగటు ఆయుర్ధాయం 69 ఏళ్లు ఉంటే రాష్ట్రంలో 70 ఏళ్లుగా ఉందని చెప్పారు. ప్రతి వెయ్యి మంది శిశు జననాలకు ఐఎంఆర్ దేశంలో 28 ఉంటే, రాష్ట్రంలో 24 మాత్రమేనన్నారు.

కుటుంబ సభ్యుల ప్రొఫైల్‌కు తగ్గట్టుగా పథకాలు

ప్రతి కుటుంబానికీ ఒక ఎంట్రప్రెన్యూర్ ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సిఎం ఆదేశించారు. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, కుటుంబ సభ్యుల ప్రొఫైల్‌కు తగ్గట్టుగా ప్రభుత్వ పథకాలు అందించడంపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంతో అర్హులందరికీ పథకాలు అందించి, పేదరికం లేని సమాజాన్ని సాధించవచ్చన్నారు. పిపిపి మోడ్‌లో మరిన్ని ప్రాజెక్టులు ప్రవేశపెడితే పేదరికం లేని రాష్ట్రంగా ఎపి అవతరిస్తుందని చెప్పారు. పి-4 ప్రాజెక్టుకు అమరావతి నిర్మాణం ఒక ఉదాహరణ అన్నారు. పిఎం సూర్య ఘర్‌తో ప్రతి ఇంటికీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో సిఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నాబార్డు ఛైర్మన్

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి మరింత రుణం అందించేందుకు సహకారం అందిస్తామని నాబార్డు ఛైర్మన్ షాజీ కృష్ణన్ జీ హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలను నాలెడ్జ్ ఎకానమితో మరింత మెరుగుపరిచేందుకు పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ఉండవల్లి నివాసంలో సిఎం చంద్రబాబుతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు సహకారం, మత్స్యరంగం అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్రానికి ఆర్‌ఐడిఎఫ్ కింద అందించే అదనపు కేటాయింపులు, సహకార సంఘాలకు రాయితీలు మరింత అందిస్తామని షాజీ పేర్కొన్నారు. రాష్ట్రంలో మత్స్య రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం కోసం ఎఫ్‌ఐడిఎఫ్ పథకంలో మంజూరైన రూ.450 కోట్ల వినియోగంపైనా సమావేశంలో చర్చ జరిగింది. అమరావతిలో నాబార్డు ఐకానిక్ భవనాన్ని ఏడాదిన్నరలోనే పూర్తి చేస్తామని షాజీ హామీ ఇచ్చారు.

విద్యాసాగర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు పెట్టిన కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ వ్యాపారవేత్త కె విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో ఈ నెల 9న తీర్పు చెబుతామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఆదేశించారు. పోలీసు ఉన్నతాధికారులతో కలిసి కుట్రపూరితంగా జత్వానీని తప్పుడు కేసులో ఇరికించారని పిపి వాదించారు. ఇందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. కేసు నమోదుకు ముందే జత్వానీని అరెస్ట్ చేసే నిమిత్తం ముంబైకు వెళ్లేందుకు పోలీసులు విమాన టికెట్లు కొన్నారన్నారు. ఈ కేసులో పోలీసులు నిజాలు బయటకు రానీయడం లేదని విద్యాసాగర్ తరపున న్యాయవాది తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రవీందర్‌రెడ్డిపై కేసుల వివరాలివ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీందర్‌రెడ్డిపై సోషల్ మీడియా పోస్టులపై రాష్ట్రంలో వేర్వేరు చోట్ల నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన భర్త రవీందర్‌రెడ్డిపై రాష్ట్ర వ్యాప్తంగా నమోదు చేసిన కేసుల వివరాలు ఇవ్వడం లేదంటూ కళ్యాణి వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. అన్ని కేసులనీ ఒకటిగా పరిగణించాలని కోరింది. కేసుల వివరాలు కావాలని పిటిషనర్ వినతిపత్రం ఇవ్వలేదని పోలీసులు వాదించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి అనిల్ కుమార్ యాదవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను 100 శాతం ప్రైవేటీకరిస్తూ... ఎకనామిక్ ఎఫైర్స్ కేబినెట్ కమిటీ 2021లో నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. ఉమ్మడి ఎపిలో 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' ఉద్యమం జరిగిందన్నారు. ఈ స్టీల్ ప్లాంట్‌కు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1977లో శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 64 గ్రామాల ప్రజలు 22 వేల ఎకరాలను ఈ ప్లాంట్ కోసం త్యాగం చేశారన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు 16 వేల మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. ఇలాంటి ప్లాంట్‌ను ప్రైవేటీకరించడంపై కార్మికులు, స్థానిక ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తోన్న విషయాన్ని సభ ద్వారా కేంద్రం దృష్టికి తెచ్చారు. ప్రజల ఉద్యమాన్ని అర్థం చేసుకుని ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

యురేనియం తవ్వకాలను నిలిపివేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి -ప్యాపిలి (నంద్యాల)

నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని జక్కసానిగుంట, మామిళ్లపల్లె, రాంపురం గ్రామాలలో యురేనియం తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. యురేనియం తవ్వకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జక్కసానికుంట్ల గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ శివారులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. యురేనియం తవ్వకాలు చేపట్టడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతారని, గతంలో జార్ఖండ్ రాష్ట్రంలో 600 మందికిపైగా కేన్సర్ బారిన పడ్డారని తెలిపారు. ప్యాపిలి మండలంలో యురేనియం తవ్వకాల వల్ల మూడు గ్రామాల ప్రజలే కాక గుడిపాడు, ప్యాపిలి, రాయలచెరువు వరకు దీని ప్రభావం ఉంటుందని వివరించారు. ఈ విషయమై అన్ని పార్టీలతో చర్చించి, ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్నారు. ఇటీవల కర్నూలు జిల్లా కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాల కోసం ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారని చెప్పారు. ప్రజల నిరసనలతో తవ్వకాలు నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఇప్పుడు ప్యాపిలి మండలంలో తవ్వకాలకు సన్నద్ధం కావడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి రామచంద్రయ్య, రామాంజినేయులు, లెనిన్ బాబు, రంగ నాయుడు, నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరుబాట

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా ప్రజల్లో ఎన్నడూ చూడని వ్యతిరేకత కనిపిస్తోందని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు చేసిన సూపర్ సిక్స్ వాగ్దానాలు గాలికి ఎగిరిపోయాయని చెప్పారు. అన్ని జిల్లాల వైసిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నీరుగారిపోయాయని, నానాటికీ అవి దిగజారిపోతున్నాయని ఆరోపించారు. వైసిపి శ్రేణులు ప్రజల తరపున గళం విప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు, ధాన్యం సేకరణలో దళారుల రాజ్యం, మద్దతు ధర దక్కకపోవడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. నియోజకవర్గాల్లో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో కలిసి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమస్యలపై ఉద్యమ బాట పట్టే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఈ నెల 11న ధాన్యం సేకరణ, రైతుల సమస్యలపై కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. 27న విద్యుత్ ఛార్జీల బాదుడే బాదుడు కార్యక్రమానికి నిరసనగా జిల్లాల్లో విద్యుత్‌శాఖ ఎస్ఇ కార్యాలయాలతోపాటు, సిఎమ్‌డి కార్యాలయాల వద్ద వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమం చేయబోతున్నట్లు చెప్పారు. జనవరి 3న అన్ని జిల్లాల కలెక్టరేట్‌లలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన రూ.3,900 కోట్లు చెల్లించాలని కోరుతూ కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. సంక్రాంతి తరువాత తాను 'జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో జిల్లాల పర్యటన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి బుధవారం, గురువారం పార్లమెంట్ నియోజకవర్గాల వారీ కార్యకర్తలతో సమావేశమవుతానని చెప్పారు. ఈలోపు జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్తకూ ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ ఖాతాలు ఉండాలని ఆదేశించారు. జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి కార్యకర్త ప్రశ్నించాలని కోరారు.

ఇంటి పైకప్పులు కూలి ఐదుగురు మృతి

- అనంతపురంలో దంపతులతోపాటు చిన్నారి
- సత్యసాయి జిల్లాలో ఇద్దరు రైతులు

ప్రజాశక్తి - కుందుర్పి, చిలమత్తూరు

వేర్వేరు ఘటనలో ఇంటి పై కప్పులు కూలి ఐదుగురు మృతి చెందారు. అనంతపురం జిల్లాలో దంపతులతో పాటు చిన్నారి మృతి చెందారు. సత్యసాయి జిల్లాలో వ్యవసాయ తోట వద్ద నిర్మాణం చేపడుతున్న ఇంటి పైకప్పు కూలి ఇద్దరు రైతులు మరణించారు. ఈ రెండు సంఘటనలతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామానికి చెందిన గంగన్న (43), శ్రీదేవి (38) దంపతులకు కుమార్తె సంధ్య (14), కుమారుడు ఉన్నాడు. కుమారుడు అనంతపురంలోని ఓ కాలేజీ హాస్టల్లో ఉంటూ ఇంటర్ చదువుతుండగా కుమార్తె తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వీరి చౌడు మిద్దె నానిపోయి మంగళవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. పైకప్పు వీరి ముగ్గురిపై పడడంతో వారంతా అందులో కూరుకుపోయారు. బుధవారం ఉదయం తమ కుమారుడు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి గంగన్న తల్లి వెళ్లి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలోనుంచి చూడగా ఇంటి పైకప్పు కూలిన విషయాన్ని గమనించి చుట్టుపక్కల వారి సాయంతో లోపలికి వెళ్లి చూడగా అప్పటికే గంగన్న, శ్రీదేవి, సంధ్యలు మట్టిలో కూరుకుపోయి మృతి చెందారు.

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు శివారెడ్డి (50) తన పొలంలో పొగాకు పంట సాగు, కాపలాకు అనుకూలంగా ఉండేలా పొలంలోని ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఇంటి పై భాగాన కాంక్రీటు వేస్తుండగా ఒక్కసారిగా స్లాబు కొంతమేర కిందికి కుంగింది. శివారెడ్డి, ఆయన కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, రైతు లక్ష్మీనారాయణ రెడ్డి (45) కలిసి స్లాబ్ కింద భాగంలో కర్రలను అమరుస్తుండగా ఒక్కసారిగా స్లాబ్ మొత్తం వారిపై కూలిపోయింది. లక్ష్మీనారాయణరెడ్డి అక్కడికక్కడే మరణించారు. తీవ్ర గాయాలైన శివారెడ్డి, రాజశేఖర్ రెడ్డిని బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో శివారెడ్డి మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి లోకేష్ ఆరా

రుద్రంపల్లి ఘటన విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శబరిమల యాత్రలో ఉన్న ఆయన ఘటనపై స్థానిక టిడిపి నాయకులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులను గ్రామానికి పంపి సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఘటన వివరాలను తెలుసుకుని బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

- డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి హామీ



డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడీ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి), ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) సంఘాల నాయకులతో గుంటూరులోని డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం చర్చలు జరిపారు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ చర్చల్లో పలు అంశాలపై ఆయన సానుకూలంగా స్పందించారు. అంగన్‌వాడీ వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలుపై ముఖ్యమంత్రి, మంత్రితో చర్చించి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని డైరెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చేందుకు త్వరలో ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. హెల్పర్ల ప్రమోషన్ మార్గదర్శకాలు రూపొందించి వెంటనే అర్హులందరికీ ప్రమోషన్లు ఇస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదం తొలగిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న సిబి ఈవెంట్స్, అద్దెలు, టిఎ బిల్లులు వెంటనే ఇస్తామని, కేంద్రాలకు మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్ బిల్లులకు బడ్జెట్ కేటాయిస్తామని తెలిపారు. వివిధ రకాల యాప్‌లను ఒక యాప్ కింద తీసుకొస్తామన్నారు. బాలసంజీవని యాప్‌లో చేస్తే పోషణ ట్రాక్టర్ యాప్‌లో కూడా నమోదయ్యే విధంగా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. రికార్డు వర్క్ తగ్గిస్తామని, ఒటిపి రద్దు చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 164 పోస్టుల భర్తీ, మెనూ ధరల పెంపు, పిల్లలకు సాయంత్రం స్నాక్స్, యూనిఫాం ఒకే కలర్, వేతనంతో కూడిన మెడికల్ లీవు, వేసవి సెలవులు, పెండింగ్ వేతనాలు వంటి అంశాలను పరిష్కరించేందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సుమారు 4 గంటలపాటు యూనియన్లతో డైరెక్టర్ చర్చలు జరిపారు. ఈ చర్చల్లో శాఖ జాయింట్ డైరెక్టర్ మనోరంజన్, సిఐటియు అనుబంధం యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సుబ్బరావమ్మ, జి బేబిరాణి, నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, లక్ష్మీదేవి, షీబా, దీప్తి, మనోజ్, ఎఐటియుసి అనుబంధ యూనియన్ నుంచి జె లలితమ్మ, మంజుల, ప్రేమ, ఐఎఫ్‌టియు యూనియన్ నుంచి ఎఆర్ జ్యోతి, భారతి, పి శోభ, ఎస్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సెకితో ఒప్పందాలపై ఎసిబికి నేడు ఫిర్యాదు

- పిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెకితో విద్యుత్ ఒప్పందాలపై ఎసిబికి గురువారం ఫిర్యాదు చేయనున్నట్లు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రాష్ట్రం మొత్తాన్ని దోచేశారన్నారు. మీ నిర్లక్ష్యాన్ని, అవినీతిపై నిలదీస్తే అది పర్సనల్ అవుతుందా? అంటూ ప్రశ్నించారు. మద్య నిషేధం అని చెప్పి కల్తీ మద్యాన్ని విక్రయించడం, ధరల స్థిరీకరణ నిధి లేకపోవడం, గంగవరం పోర్టు అమ్మకం, వివేకా హత్య, సోషల్ మీడియాలో సైతాన్ సైన్యం ఈ అంశాలపై మాట్లాడితే పర్సనల్ ఎలా అవుతుందన్నారు. తాను పర్సనల్‌గా మాట్లాడితే జగన్ ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టరన్నారు. ప్రజల్లో జగన్ విశ్వసనీయత కోల్పోయారన్నారు. అదాని నుంచి విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అన్ని ఆధారాలు ఉన్నా ఎందుకు మౌనంగా ఉన్నారని సిఎం చంద్రబాబును ప్రశ్నించారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయకుంటే అది సక్రమమేనని ప్రకటించాలన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.17,500 కోట్లు భారం మోపారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారని, మరి రైతులకు రూ.20 వేలు, ప్రతి బిడ్డకు రూ.15 వేలు, మహిళలకు నెలకు రూ.1,500, ఉచిత బస్సు వంటివి పథకాల ఊసే లేదన్నారు. ఈ ఆరు నెలల్లో ఎన్ని హామీలు అమలు చేశారో సిఎం చంద్రబాబు... ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని కోరారు. అదానితో ఒప్పందాలపై పరిశీలన చేయాలని సిఇఆర్‌సి లేఖ రాసినట్లు చెప్పారు. అలాగే ఉత్తరప్రదేశ్ పర్యటనకు వెళ్లిన రాహుల్, ప్రయాంకను అడ్డుకోవడం దారుణమన్నారు. సంభల్‌లో బిజెపి అసత్య ప్రచారం చేస్తోందని, నలుగురు ముస్లిములను పొట్టనపెట్టుకుందని తెలిపారు. బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతుందని చెప్పారు. సమావేశంలో పిసిసి నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కాపు రిజర్వేషన్లపై హైకోర్టు సందేహం

ప్రజాశక్తి-అమరావతి

ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఇడబ్ల్యుఎస్) విద్య, ఉపాధి అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్ల కల్పన చట్టానికి లోబడి కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హైకోర్టు సందేహాన్ని వ్యక్తం చేసింది. ఇడబ్ల్యుఎస్ కోటా 10 శాతం రిజర్వేషన్లలో ఒక్క కాపులకే 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేసింది.

ఇది సముచితంగా లేదని వ్యాఖ్యానించింది. ఇడబ్ల్యుఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన 103 రాజ్యాంగ సవరణ, కాపులకు 5 శాతం రిజర్వేషన్ల చట్టాలను సుప్రీంకోర్టులో సవాలు చేసిన పిటిషన్లపై పరిణామాలను తమకు నివేదించాలంది. ఆ తర్వాత తగిన ఉత్తర్వులు ఇస్తామని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. విచారణను జనవరి 29కు వాయిదా వేసింది. ఇడబ్ల్యుఎస్ కోటా 10 శాతంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ అమలు చేయకపోవడాన్ని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య, రాజమండ్రికి చెందిన అడ్డేపల్లి శ్రీధర్, లక్ష్మణ్, విజయవాడకు చెందిన కమ్మిలి కృష్ణ, ఉత్కర్ష్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే ఇడబ్ల్యుఎస్ కోటాలో 5 శాతం కాపులకు రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాలు చేస్తూ గుంటూరు జిల్లా, కృష్ణాయపాళెంకు చెందిన పెద్ది రామకృష్ణ, కర్నూలుకు చెందిన కె చంద్రశేఖర శర్మ, మిత్రవింద ఇతరులు వేరుగా వ్యాజ్యాలు వేశారు.

పుష్ప-2 టిక్కెట్ల ధర పెంపుపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా థియేటర్లలో టిక్కెట్ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినివ్వడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. నెల్లూరు జిల్లా, ముత్తుకూరుకు చెందిన వెంకటేశ్వర్లు వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం తీర్పును రిజర్వు చేసింది. భారీ బడ్జెట్ సినిమాల టిక్కెట్ ధరల రేట్ల పెంపును తొలి 10 రోజులకే పరిమితం చేయాలని గతంలో ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేసింది. కొత్త సినిమా విడుదలైన ప్రతిసారి టిక్కెట్ల ధరలపై వ్యాజ్యాలు పడుతున్నాయని వ్యాఖ్యానించింది. ఇష్టం లేనివాళ్లు సినిమాకు వెళ్లకుండా ఉంటే సరిపోతుంది కదా అని వ్యాఖ్యానించింది.

104 విభాగంపై ఎస్మా ఎత్తివేయాలి:

- ముఖ్యమంత్రికి వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 104 సేవలను ఎస్మా పరిధిలోకి తీసుకొస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్రకమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం లేఖ రాశారు. తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అరబిందో యాజమాన్యం అనుసరించిన ఉద్యోగ వ్యతిరేక విధానాల వల్ల వచ్చిన సమస్యలను పరిష్కరించాలని వైద్య ఆరోగ్యశాఖ శాఖమంత్రి తో పాటు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారని వివరించారు. అయినా అవి ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. వేతనాల బకాయిలు, పెండింగ్ బిల్లులు మూడేళ్ల ఇంక్రిమెంట్లు, పిఎఫ్‌లో యాజమాన్య వాటా చెల్లించాలని, శ్లాబ్ ప్రకారం వేతనాలు చెల్లించాలనే న్యాయమైన కోర్కెలు కోసం ఉద్యోగులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వారి కోర్కెలు తీర్చకపోగా రాష్ట్రప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తామని ప్రకటించడం గర్హనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఎస్మా ఉత్తర్వులు ఎత్తివేసి ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరారు.

ఐటిని వికేంద్రీకరించండి

ఐటిని వికేంద్రీకరించాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖతో సహా కర్నూల్ నుంచి అనంతపురం వరకు ఉన్న రాయలసీమ కారిడార్‌లో ఐటి హబ్‌ను అభివృద్ధి చేయటానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరో ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ ఐటి హబ్‌గా రాష్ట్రాన్ని మారుస్తామని, అందుకు అవసరమైన నూతన ఐటీ పాలసీని మంత్రిమండలి ఆమోదించినట్లుగా మీడియాలో వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే లక్షల సంఖ్యలో ఇంజనీరింగ్ నిరుద్యోగులు ఉద్యోగాలు లేక కూలి పనులకు, గిగ్, ప్లాట్ ఫామ్ వర్కులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. గతంలో మాదిరి విదేశాలకు సైతం అవకాశాలు తగ్గిపోయాయని తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతు కుటుంబాల నుంచి దళిత ఆదివాసి వ్యవసాయ కార్మిక కుటుంబాల్లోనూ పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐటి పరిశ్రమలను అభివృద్ధి చేసి వారికి ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారీ ప్రణాళికల పేరుతో నిరుద్యోగుల్ని భ్రమలో పెట్టడానికి బదులు వివిధ ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమలు లేదా హక్కులను అభివృద్ధి చేయటం ద్వారా వాస్తవికం చేయాలని అందుకు అవసరమైన నిధులను తక్షణం కేటాయించాలని కోరారు.



ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

బకాయి వేతనాలు చెల్లించాలని ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

బకాయి వేతనాలు చెల్లించాలని, ఆస్పత్రి, క్యాంటీన్ సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఉక్కు కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు గడిచిన మూడు నెలలుగా బకాయి పడ్డ 185 శాతం వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో తన వైఖరిని మార్చుకోకున్నా తెలుగు రాష్ట్రాల ఎంపీలు ప్రశ్నించకపోవడం దుర్మార్గమన్నారు. టిడిపి, జనసేన మద్దతుతోనే కేంద్రంలో బిజెపి అధికారంలో ఉందని, ఇప్పుడు ఆ పార్టీని చంద్రబాబు, పవన్‌లు ప్రశ్నించకుంటే రాష్ట్ర ప్రజల దృష్టిలో ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. కేంద్రం సాయం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తోందని, దానిలో ఒక్కపైసా కూడా స్టీల్‌ప్లాంట్ వినియోగించుకోలేదని స్పష్టం చేశారు. ఆ మొత్తాన్ని బ్యాంకులకు, ప్రభుత్వానికి చెల్లించిన విషయం నాయకులకు తెలియదా? అని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన చర్యలను కేంద్రం తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఫిబ్రవరి నుంచి కార్మికుల వేతనాలపై ఆంక్షలు విధిస్తూ వారిని మనోవేదనకు గురిచేస్తోందని తెలిపారు. కార్మికుల సంక్షేమం నుంచి ప్లాంట్ యాజమాన్యం పక్కకు తప్పుకుంటోందన్నారు. సంఘం అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ అత్యంత ప్రమాదకర ప్రదేశాల మధ్య పని చేస్తున్న కార్మికులకు అందించాల్సిన వైద్యం విషయంలో యాజమాన్యం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ధర్నాలో సంఘం నాయకులు కె.గంగాధర్, కృష్ణమూర్తి, మరిడయ్య, బి.అప్పారావు, శ్రీనివాసరాజు, వి.ప్రసాద్, మహేష్, తౌడన్న, శ్రీనివాస్, ఎంవి.రమణ, కె.భానుమూర్తి, సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, ప్లాంట్‌లోని వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమించుకున్నారంటూ పిల్

ప్రజాశక్తి-అమరావతి

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మరదలు గాలి వసుమతి ధర్మవరం గ్రామంలోని ధర్మవరం చెరువును ఆక్రమించుకున్నారంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. కోట్ల అజాష్ బాబు వేసిన పిల్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. జల వనరులశాఖ ముఖ్యకార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్, వెంకటామిరెడ్డి, వసుమతి కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. విచారణను జనవరి 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. చెరువు విస్తీర్ణం 1,732 ఎకరాలని, చాలా మేరకు ఆక్రమణ చేశారని పిటిషనర్ వాదన. గత 50 ఏళ్లుగా ఆ భూమిపై తమకు యాజమాన్య హక్కులున్నాయని ప్రతివాదులు వాదించారు.

సెకి ఒప్పందంపై ఆలోచిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించకపోతే రాష్ట్రం నేరుగా దర్యాప్తుచేయవచ్చని కూడా ఇఎఎస్ శర్మ సూచిచారు. అయితే, ముఖ్యమంత్రి ఈ విషయాల గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. 'ఏం చేయాలో ఆలోచిస్తున్నాం.' అని మాత్రమే ఆయన చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

కొనుగోళ్లల్లో రైతులకు అన్యాయం జరుగుతోందని, రైతులకు ధాన్యం బస్తాలను తక్కువ చూపుతున్నారని సిఎం దృష్టికి ఒక విలేకరి తీసుకురాగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు వాట్సప్ నెంబర్ అందుబాటులో తీసుకొచ్చామని చెప్పారు. అందులో నెంబర్ రిజిస్టర్ చేయగానే ఐవిఆర్ఎస్ ద్వారా సందేశం వెళుతుందన్నారు. తద్వారాఆ రైతుకు చెందిన ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగిందో లేదో తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ఇటీవల తుఫాన్ సంభవించిన సమయంలో రైతులపై భారం పడకుండా ధాన్యాన్ని మిల్లులకు ప్రభుత్వమే తరలించిందని తెలిపారు. ఎక్కడైనా చిన్న ఇబ్బంది వచ్చినా ప్రభుత్వాన్ని నిందించటం సహజంగా జరిగే ప్రక్రియే అని అన్నారు. ఇసుక వాహనాలకు ఉచితం అనే బోర్డు పెట్టి ఎన్ని టన్నులైనా రవాణా చేసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కాకినాడ పోర్టు, సెజ్‌ల్లో బలవంతంగా వాటాలు రాయించుకున వ్యవ్యహారం ల్యాండ్ గ్రాబింగ్ పరిధిలోకి వస్తుందేమో చూడాల్సి ఉందన్నారు. ప్రస్తుతం భూవివాదాలపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని చెప్పారు. అధికారులు పరిష్కారం చూపకుండా మరో అధికారికి బదిలీ చేస్తున్నారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారికి పరిష్కారం లభించే అంశంపై కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. 22ఎ భూముల అంశంపై చిక్కుముడులు అనేకం ఉన్నాయని తెలిపారు. 'రాజధానిలో ఎప్పుడు ఒక ఇంటి వారవుతున్నారు' అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆ పనులను తన ఇంటి హోంమంత్రి (భువనేశ్వరి), కుటుంబ సభ్యులు చూసుకుంటున్నారని చెప్పారు. రాజధాని నిర్మాణం మాత్రమే తాను చూస్తానని,తన ఇంటి నిర్మాణ వ్యవహారాలు కుటుంబ సభ్యులు చూసుకుంటారని వెల్లడించారు.

గిరిజన సమగ్ర ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలి

- అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలి : వి శ్రీనివాసరావు
- పాడేరులో సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ ప్రారంభం
- భారీ ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆదివాసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అదానీతో చట్ట విరుద్ధంగా చేసుకున్న హైడ్రో ప్రాజెక్టుల ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ పాడేరులో బుధవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత పాడేరులోని తలారిసింగి జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, ఐటిడిఎ మీదుగా పాత బస్టాండ్ వరకు సిపిఎం కార్యకర్తలు, ఆదివాసీలతో భారీ ర్యాలీ సాగింది. మహిళల థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజన వాయిద్యాలతో ఆదివాసీలు సందడి చేశారు. ఎర్ర జెండాలను చేబూని సమరోత్సాహంతో కదిలారు. అనంతరం పాడేరు పాత బస్టాండ్ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన విశాఖ జిల్లాలో 2022 వరకూ ఉన్న పాడేరు ఏజెన్సీ అనంతర కాలంలో ప్రత్యేకంగా అల్లూరి జిల్లాగా ఏర్పడిందని, ప్రస్తుతం రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో అట్టడుగుకు చేరిందని అన్నారు. జిల్లా ఏర్పడి మూడేళ్లు అవుతున్నా అల్లూరి జిల్లా ప్రగతిపై ఎటువంటి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికనూ ప్రభుత్వం అమలు జరపలేదని గుర్తు చేశారు. పాడేరు ఏజెన్సీలో తొమ్మిది హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి దాదాపు ఐదు వేల ఎకరాల అటవీ భూములను అక్రమంగా అదానీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుందని తెలిపారు. రాజ్యాంగంలోని షెడ్యూలు 5 నిబంధనలకు, పీసా చట్టానికి విరుద్ధంగా, గ్రామసభలను నిర్వహించకుండానే భూమిని అదానీకి కట్టబెడుతూ నాటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. గ్రీన్ విద్యుదుత్పత్తి పేరుతో అల్లూరి జిల్లాతో సహా అనేక జిల్లాల్లో వేలాది ఎకరాలను అదానీకి కట్టబెట్టడమే కాకుండా, అధిక ధరలు పెట్టి విద్యుత్ ఒప్పందాలను చేసుకున్నారని వివరించారు. విద్యుత్ నియంత్రణ మండలి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోకుండా గుడ్డిగా వీటిని ఆమోదించడంతో ప్రజలపై విద్యుత్ భారాలు పడనున్నాయని తెలిపారు. నాడు స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని టిడిపి కూటమి పాలకులు చెప్పి, నేడు వాటిని పెట్టుకోవాలని చెప్పడం అదానీకి దోచిపెట్టడానికేనని విమర్శించారు. మోడీ చెప్పడం వల్లే అదానీతో ఒప్పందాలన్నీ చేశామని మాజీ ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా చెబుతున్నారన్నారు. అదానీ అక్రమాలకు కొమ్ము కాయడానికి రాష్ట్రంలోని టిడిపి కూటమి పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అదానీతో జరిగిన అన్ని ఒప్పందాలనూ రద్దు చేయాలని, ట్రూ అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, అదానీ అవినీతిపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం మెగా డిఎస్‌సిపై చేసినా, నేటికీ దానికి అతీగతీ లేదన్నారు. జిఒ నెంబర్ 3 రద్దుతో ఆదివాసీ నిరుద్యోగుల్లో నిస్పృహ అలముకుందని తెలిపారు. ఈ జిఒను పునరుద్ధరిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీపై నేటికీ చర్యలు లేవన్నారు. మెగా డిఎస్‌సితోపాటు ఆదివాసీ డిఎస్‌సి కూడా నిర్వహించి గిరిజనులకు న్యాయం చేయకపోతే వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. సూపర్ సిక్స్ ఎన్నికల హామీలపై షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని పివిటిజి గిరిజనుల పథకాలను మోడీ ఊడగొట్టారని, డోలీ మోతలు, ఆదివాసీల మరణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీకొక ఫీడర్ అంబులెన్స్ పెట్టి ఈ పరిస్థితిని నిర్మూలించాలని డిమాండ్ చేశారు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీలకు వ్యతిరేకమని, 11 ఏళ్ల నుంచి ఆదివాసీలపై బిజెపి యుద్ధం చేస్తోందని, రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్‌కు భిన్నంగా మార్పులు చేస్తోందని అన్నారు. అభివృద్ధి పథకాలను ఆదివాసీలకు దూరం చేసిందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలోని కాఫీ రైతుల సమస్యలను పరిష్కరించాలని, ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దీసరి గంగరాజు, బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, ఎస్.హైమావతి పాల్గొన్నారు. అనంతరం కాఫీ హౌస్‌లోని సీతారాం ఏచూరి నగర్‌లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది.



బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సాంస్కృతిక వైభవం పునరుద్ధరణకు చర్యలు

- మంత్రి కందుల దుర్గేష్
- ఏపి నాటక అకాడమీ చైర్మన్‌గా గుమ్మడి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - విజయవాడ

కళలు, సాంస్కృతిక వైభవం పునరుద్ధరణే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతి సమితి ఆధ్వర్యంలో విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఎపి నాటక అకాడమీ చైర్మన్‌గా గుమ్మడి గోపాలకష్ణ ప్రమాణ స్వీకారోత్సవం, పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల విగ్రహానికి మంత్రి కందులు దుర్గేష్, గుమ్మడి గోపాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కందుల మాట్లాడుతూ నృత్య, నాటక, సృజనాత్మకత, సాంస్కృతిక అకాడమీలతో కళారంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. పద్య నాటకంలో గుమ్మడితో సరితూగగల సమకాలిన నటుడు లేరని గుర్తు చేశారు. తెలుగు ఖ్యాతిని దేశ, విదేశాల్లో పెంపొందించారన్నారు. తెలుగు సంస్కృతిలోనే పద్య నాటకం ఒక భాగమని, రాగయుక్తంగా పద్య నాటకాన్ని ప్రదర్శించడంలో మన శైలి ప్రపంచంలో మరే భాషకు లేదన్నారు. అంతటి విశిష్టత ఉన్న పద్య నాటకం కీర్తిని దశదిశలా వ్యాపింపజేసిన గుమ్మడి అభినందనీయులని కొనియాడారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి గోపాలకష్ణ మాట్లాడుతూ పూర్వం పొలం పనులు ముగిసిన తర్వాత పంట విరామ కాలంలో ప్రజలందరూ ఆటలు, పాటలు, నాటకాలతో కాలక్షేపం చేసేవారని గుర్తు చేశారు. మళ్లీ నాటక రంగానికి అంతటి పూర్వ వైభవం తేవడానికి కషి చేస్తానన్నారు. కళలను ప్రోత్సహించేందుకు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, దీంతోపాటు వారానికి కనీసం ఒక నాటకం ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్మన్ తేజశ్వీలు పాల్గొన్నారు.



గుమ్మడి గోపాలకృష్ణతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పాఠశాల ప్రహరీ కూలి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ (నంద్యాల జిల్లా)

పాఠశాల ప్రహరీ గోడ కూలి విద్యార్థిని మృతి చెందిన సంఘటన నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు నందికొట్కూరు పట్టణానికి చెందిన షేక్ శాలి బాషా, షేక్ రుక్సానాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఆస్తా మాహిన్ (8) పట్టణంలోని విద్యానగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల రెండో తరగతి చదువుతుంది. రోజూలాగే పాఠశాల వదిలిన తరువాత బయటకు వెళుతుండగా ప్రహరీ గోడ కూలి మాహిన్‌పై పడింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. మరో విద్యార్థి అజిత్‌కు గాయాలయ్యాయి. కుమార్తె చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.



మాహిన్ మృతదేహం వద్ద విలపిస్తున్న బాలిక తల్లిదండ్రులు

గ్రామీణాభివృద్ధికి నాబార్డు కృషి

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా రుణ ప్రణాళిక, పర్యవేక్షణ, అభివృద్ధి, వ్యవసాయ ప్రోత్సాహక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి రాష్ట్రాభివృద్ధికి నాబార్డు తనవంతు కృషి చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో నాబార్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, నాబార్డు ఛైర్మన్ షాజీ కెవిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నాబార్డు విశేష కృషి చేస్తోందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.45 వేలకోట్లు కేటాయించామన్నారు. అమరావతిలో నిర్మించే నాబార్డు శాశ్వత ప్రాంతీయ కార్యాలయానికి ఇప్పటికే భూమిని కేటాయించామని, దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని రకాల సదుపాయాలతో ఐకానిక్‌లా నిర్మిస్తామని చెప్పారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చట్టం తీసుకొస్తున్నామన్నారు. మత్స్యరంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని, ఎగుమతులను మరింత ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్‌తో వ్యవసాయం చేసేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇప్పటికే 40 వేల డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... నాబార్డు సాయంతో ప్రతిపాదించిన పథకాలు, ప్రాజెక్టులన్నింటినీ ప్రారంభించి మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని సూచించారు. బ్యాంకింగ్ నెట్‌వర్క్‌ను భలోపేతం చేయడానికి, సమ్మిళిత బ్యాంకింగ్‌ను ప్రోత్సహించడానికి నాబార్డు విశేష కృషి చేస్తోందన్నారు. నాబార్డు ఛైర్మన్ షాజీ కెవి మాట్లాడుతూ... నాబార్డు శాఖలు, కార్యనిర్వాహక ఏజెన్సీలతో నిరంతరం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. నాబార్డు ఆర్థిక సహకారం అందిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్, స్పెషల్ సిఎస్ బుడితి రాజశేఖర్, ప్రభుత్వ కార్యదర్శి రెనార్డ్ రోస్, రిజర్వ్ బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిని పోషించని కుమారుడిపై బైండోవర్

- భూమిని ఆమెకే స్వాధీనం చేసిన అధికారులు

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)

భూమిని తీసుకొని.. తల్లిని పోషించని కుమారుడిని బైండోవర్ చేసి.. ఆ భూమిని తిరిగి ఆమెకే అధికారులు అప్పగించిన ఘటన పంగులూరు మండలంలోని కొండమూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. తహశీల్దార్ సింగారావు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన బత్తుల రామకోటి, శేషమ్మ దంపతులకు కొండమూరు గ్రామంలో 31 సెంట్ల భూమి ఉంది. రామకోటి కొద్దికాలం క్రితం మృతి చెందారు. శేషమ్మ భూమిని ఆమె రెండో కుమారుడు శ్రీను దౌర్జన్యంగా ఆక్రమించుకొని, సాగు చేసుకుంటూ తల్లి పోషణను చూడడం లేదు. దీంతో శేషమ్మ గత నెల 11న బాపట్లలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు.



విచారణ జరుపుతున్న తహశీల్దార్

కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పంగులూరు మండల తహశీల్దార్ పి సింగారావు, ఎంపిడిఒ కె స్వరూపరాణి, రేణింగవరం ఎస్ఐ వినోద్‌బాబు కొండమూరు గ్రామం వెళ్లి విచారణ చేశారు. బత్తుల శ్రీను తన తల్లికి చెందిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని నిర్ధారించి, ఎంసి 47 కింద ఆయనపై బైండోవర్ చేయించారు. భూమిని అర్జీదారు శేషమ్మకు అప్పగించినట్లు తహశీల్దార్ తెలిపారు.

వచ్చే ఏడాది భారత పారాసెటమాల్

సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ కలయిసెల్వి వెల్లడి




న్యూఢిల్లీ : వచ్చే ఏడాది మేడ్ ఇన్ ఇండియా పారాసెటమాల్ అందుబాటులోకి రానుందని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ కలైసెల్వి తెలిపారు. దీంతో చైనా లాంటి పారిశ్రామిక ఆవిష్కరణలపై ఆధారపడటం తగ్గనుందన్నారు. సిఎస్ఐఆర్ తొలి మహిళ డైరెక్టర్ జనరల్ అయినా కలైసెల్వి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారతదేశ పారిశ్రామిక ఆవిష్కరణలను పెంచడానికి తమ పరిశోధనా సంస్థ చేస్తున్న ప్రయత్నాల గురించి వెల్లడించారు. గడిచిన మూడు, నాలుగేళ్లలో ఎన్నో ఆవిష్కరణలు చేశామన్నారు. తాము స్వదేశీ హైడ్రోజన్ సిలిండర్ టైప్-4 పారాసెటమాల్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఇతర ఆవిష్కరణలలో హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ, హన్సా-3 టూ-సీటర్ లైట్ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ వంటి ఏరోస్పేస్ టెక్నాలజీ, సివిడి ఫార్మింగ్ టెక్నాలజీ, రోడ్డు నిర్మాణంలో స్టీల్ స్లడ్జ్ నిర్వహణ తదితర వినూత్న కల్పనలు చేపట్టామన్నారు.

"భారత్ ఇప్పటి వరకు వివిధ దేశాల నుంచి పారాసిటమాల్ పదార్థాలను దిగుమతి చేసుకుంటుంది. వచ్చే ఏడాది నాటికి భారతదేశం తన స్వంత పారాసెటమాల్‌ను తయారు చేయనుంది. సిఎస్ఐఆర్ ప్రభావవంతమైన, చౌకైనా కొత్త సాంకేతికతతో దీన్ని ఆవిష్కరిస్తుంది. భారత్‌ను ఔషధ రంగంలో మరింత స్వావలంబనగా మార్చడానికి సిఎస్ఐఆర్ టెక్నాలజీతో కర్నాటకకు చెందిన సత్య దీప్త ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ దేశీయ నూతన పారాసెటమాల్, ఇతర టాబ్లెట్లను తయారు చేయనుంది." అని కలైసెల్వి తెలిపారు.

పరిశ్రమల తలుపు తట్టడం నుండి పరిశ్రమలే తమ అవసరాలు, ఆవిష్కరణల కోసం సిఎస్ఐఆర్‌ను ఆశ్రయించేలా తమ విధానం మారిందన్నారు. ప్రపంచ సరఫరా చెయిన్‌లో తమ ఉత్పత్తి వ్యవస్థలను మార్చడానికి ఎనిమిది భిన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. పరిశ్రమల అవసరాలు, ఉత్పత్తి నమూనాలు, సంస్కృతి, శైలి, యంత్రాంగాన్ని అర్థం చేసుకోవడానికి సిఎస్ఐఆర్ బృందాలు క్రమం తప్పకుండా పరిశ్రమలకు అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్నాయన్నారు. ఆగ్రోకెమికల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమోటివ్, మైనింగ్, లీజర్ ఇండస్ట్రీలలో రిడ్యూసింగ్ ఏజెంట్‌గా ఉపయోగించడానికి ఐరోపా దేశాల నుండి భారతదేశం ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న హైడ్రాజైన్ హైడ్రెట్ (హెచ్‌హెచ్) అనే రసాయనాన్ని తయారు చేయడానికి సిఎస్ఐఆర్ స్వదేశీ ప్రక్రియను అభివృద్ధి చేసిందన్నారు. దీన్ని భారత్ స్వయంగా తయారు చేసుకోవడంతో ఆ దిగుమతులు 60 శాతం తగ్గాయన్నారు. రోడ్ల తయారీలో స్టీల్ స్లగ్‌లను నిర్వహించడం మరో కీలక ఆవిష్కరణ అని పేర్కొన్నారు.

2047 నాటికి భారతదేశాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధారిత గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు దేశంలోని అన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలు ఉదాహరణగా నిలుస్తాయని సిఎస్ఐఆర్ తన గౌహతి డిక్లరేషన్‌లో తెలిపింది. దేశీయ తయారీ రంగాన్ని మార్చేందుకు, విస్తరించేందుకు సంస్థలు తమ కార్యకలాపాలను మరింత మెరుగు పర్చుకోవడం ద్వారా ప్రపంచ సరఫరా చెయిన్‌లో భారత్ స్థానం మెరుగుపడనుందని పేర్కొంది.



దేశంలో అమ్మకాలు సన్నగిల్లాయ్..

- డిస్కౌంట్ విక్రయాలు పెరుగుతాయ్
- హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో వినియోగదారల విశ్వాసం సన్నగిల్లిందని హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ సిఇఒ టకుయా సుమురా అన్నారు. ప్రతీ నెల కృత్రిమ డిమాండ్ పెరుగుతుందన్నారు. అమ్మకాలు పడిపోవడం ద్వారా డిస్కౌంట్లు పెరగొచ్చని ఆయన ఇటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే దేశంలో అమ్మకాలు మందగించాయని అన్నారు. సార్వత్రిక ఎన్నికలప్పటి నుంచి ఇప్పటి వరకు డిమాండ్ పుంజుకోలేదన్నారు. గతేడాదితో పోల్చితే పరిశ్రమల వద్ద నెల స్టాక్ అదనంగా ఉందన్నారు. గతేడాదితో పోల్చితే డిమాండ్‌లో తగ్గుదల చోటు చేసుకుంటుందన్నారు. దేశంలో డిమాండ్ ఎక్కడా కూడా బలంగా లేదన్నారు.

హీరో మోటో నుంచి విడా వి2 ఇవి స్కూటర్లు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ కొత్తగా విడా వి2 శ్రేణీలో నూతన స్కూటర్లను విడుదల చేసింది. వీటిని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిరంజన్ గుప్తా ఆవిష్కరించారు. ఇవి ప్రయాణంలో ఇది తమకు ఓ కీలక మైలురాయి అని నిరంజన్ పేర్కొన్నారు. ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద హెచ్‌వి2 లైట్ ధరను రూ.96,000గా, వి2ప్లస్ ధరను రూ.1,15 లక్షలుగా, వి2ప్రో ధరను రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. వీటిపై గరిష్టంగా మూడేళ్లు లేదా 30వేల కిలోమీటర్ల వరకు బ్యాటరీ వారంటీ ఉంటుందని తెలిపింది.





రియాల్టీ వృద్ధిలో రిట్స్ కీలకం

- పెట్టుబడులపై మెరుగైన రాబడులు
- రిట్స్, ఇన్విట్స్ క్యాంపెయిన్‌లో నిపుణులు

ప్రజాశక్తి - హైదరాబాద్

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రిట్స్)లో పెట్టుబడులు మెరుగైన రాబడులు అందిస్తాయని ఆ రంగం నిపుణులు పేర్కొన్నారు. భవిష్యత్తులో రియాల్టీ వృద్ధిలో ఇవి కీలక పాత్ర పోశించనున్నాయన్నారు. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం బుధవారం హైదరాబాద్‌లో ఇండియన్ రీట్స్ అసోసియేషన్, భారత్ ఇన్విట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బ్రూక్‌ఫీల్డ్ ప్రాపర్టీస్ ప్రెసిడెంట్ అకింత్ గుప్తా, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ సిఎఫ్ఒ రాజేష్ డిఇఒ, క్యూబ్‌హైవే ఇన్విట్ సిఇఒ వినయ్ శేఖర్, అంజెన్ ఇండియా ఎనర్జీ కాపిటల్ మార్కెట్స్ హెడ్ సుజయ మోఘెపద్యే మాట్లాడారు. రిట్స్, ఇన్విట్లు రెండింటినీ సెబీ నియంత్రిస్తుందన్నారు. ఇవి భారతదేశ రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాలలో వృద్ధిని నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రిట్స్ ఆదాయాన్ని సృష్టించే రియల్ ఎస్టేట్‌ను కలిగి ఉన్న లేదా నిర్వహించే సంస్థలు. పెట్టుబడిదారులు నేరుగా ఆస్తులను కొనుగోలు చేయకుండా ఆదాయంలో వాటాను పొందడానికి ఇవి అనుమతిస్తాయన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (ఇన్విట్లు) రోడ్లు, పంపిణీ, పైప్ లైన్లు, టెలికాం, వేర్ హౌసింగ్ లాంటి వివిధ మౌలిక సదుపాయాల రంగాలలో ఆదాయాన్ని సృష్టించే ఆస్తులను కలిగి ఉన్నాయన్నారు. గడిచిన ఐదేళ్లల్లో వీటిల్లో పెట్టుబడులపై సగటున 17.1 శాతం రాబడి ఉందన్నారు. ఇన్విట్స్ ఎయుఎం రూ.5 లక్షల కోట్లకు చేరిందన్నారు.

సంపాదకీయం

ధృతరాష్ట్ర కౌగిలి!


మహాయుతి కూటమి నాయకుడిగా ఎంపికైన దేవేంద్ర ఫడ్నవిస్‌ను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయాలంటూ మహారాష్ట్ర గవర్నర్ బుధవారంనాడు ఆహ్వానించడంతో పది రోజుల అనిశ్చితికి ఎట్టకేలకు తెర పడింది. కీలకమైన ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై సస్పెన్స్ వీడిపోయింది. నవంబర్ 23న ప్రకటించిన ఫలితాల్లో మహాయుతికి ఊహించనంత భారీ మెజార్టీ-288లో 230 సీట్లు లభించినా- ముఖ్యమంత్రి ఎవరన్నది పీటముడి పడడంతో ఆ కూటమికి ఘన విజయం పొందిన సంతోషం ఆవిరైనంత పనయ్యింది. అనిశ్చితి, గందరగోళంతోపాటు ముంబయి రాజకీయాల్ని పరిష్కరించడానికి ఢిల్లీ వంక చూడాల్సిన దుస్థితి మహాయుతి నేతలకు దాపురించింది. పదవుల పంపకాల్లో పేచీ బిజెపి అధిష్టానానికి కూడా తల బొప్పికట్టిందని కథనాలు వెలువడ్డాయి. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వున్న ఏక్‌నాథ్ షిండే ఆ పీఠాన్ని వదలబోనని మొరాయించడం ఒకవైపు, అత్యధిక స్థానాలు పొందిన బిజెపికే ముఖ్యమంత్రి పదవి అంటూ కమలనాథులు పట్టుబట్టడం ఓ ప్రహసనంగా మారింది. తామేమీ తక్కువ కాదంటూ ఎన్‌సిపి నేత అజిత్ పవార్ తన వాటా కోసం ఉభయ పక్షాలతోనూ బేరసారాలు సాగించారని వార్తలొచ్చాయి. మొత్తంగా మహాయుతి కూటమిలోని నేతలు పైకి నవ్వుతూ స్టేట్‌మెంట్లు ఇచ్చినా..లోనమాత్రం కుతకుతలాడిపోయారు. ఒక దశలో సిఎం కాకుండా డెప్యూటీ ఇస్తే తమకే హోంశాఖను ఇవ్వాలని శివసేన పట్టుబట్టింది. మరోవైపు షిండే తనయుడ్ని డిప్యూటీ అని తెర మీదకు తెచ్చాక ఆ ప్రతిపాదనకు సానుకూలత రాకపోవడంతో తూచ్.. అన్నారనీ మీడియా కథనాలు.. ఇలాంటి తతంగాలన్నీ నడిచాక ఏక్‌నాథ్ షిండేతో బిజెపి నాయకుడు దేవేంద్ర ఫడ్నవిస్ మంగళవారం సాయంత్రం భేటీ.. బుధవారంనాడు తొలుత బిజెపి శాసనసభాపక్షం, ఆ తరువాత మహాయుతి శాసనసభ్యుల సమావేశం .. ఇలా కథ ఒక కొలిక్కి వచ్చింది. ఎట్టకేలకు ఐదవ తేదీన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం జరిగినాగాని తరువాత మంత్రివర్గ కూర్పు, శాఖల కేటాయింపుల్లో ఎన్ని పేచీలు వస్తాయో, ఏ విధంగా తలెత్తి ఎలాంటి మలుపులు తిరుగుతాయో ఎవరూ చెప్పలేరు. మహాయుతి కూటమికి సంఖ్యా బలం భారీగా వున్నప్పటికీ పదవుల పంపకాల్లో విభేదాలవల్ల అది బలహీనంగానే కొనసాగుతుందని ప్రాథమిక పరిణామాలు విదితం చేస్తున్నాయి. దేశ ఆర్థిక రాజధానిగా చెప్పబడే ముంబయి నగరం, ఆ రాష్ట్రంలో ఇటువంటి అనిశ్చిత పరిస్థితి శుభస్కరం కాదు.

శివసేన పార్టీ నేడున్న పరిస్థితి చూసి పలువురు జాలి పడుతున్నారు. ఎన్నికల్లో 57 స్థానాల్లో గెలుపొందినా ఆ ఎమ్మెల్యేలను కమలనాథులు ఆ పార్టీలో కొనసాగనిస్తారా అన్నది అనేకమంది సందేహం. బీహార్‌లో జెడియుని ముక్కలు చేయడం, రామ్‌విలాస్ పాశ్వాన్ పార్టీలో చాలామందిని మింగేయడం పలువురికి గుర్తుండే వుంటుంది. స్నేహం చేసిన పార్టీలను నిర్వీర్యం చేయడమూ బిజెపి మరో ఎత్తుగడ. ఆ విధంగానే అకాలీదళ్ క్రమంగా బలహీనపడింది. హర్యానాలో చిన్న చిన్న ముక్కలుగా ఏర్పడిన ప్రాంతీయ పార్టీలను కొందరికి పదవులిచ్చి ఇంకొందరిని బెదిరించీ తమ పార్టీలోకి లాక్కున్న బిజెపి చరిత్ర జగమెరిగిందే! బిజెపి ఏ పార్టీతో చెలిమి చేసినా దాని పని అయిపోయినట్టే! ఆ విషయం జెడియు, అకాలీదళ్, ఇప్పుడు శివసేన (షిండే గ్రూపు)ను చూస్తే తేటతెల్లమవుతుంది. అలాగే దాంతో పరోక్ష స్నేహం చేసిన పార్టీలు కూడా వైసిపి, బిఆర్‌ఎస్, బిజెడి మాదిరిగా శంకరగిరి మాన్యాలు పట్టడం ఖాయం. అది ముమ్మాటికీ ఓ సుడిగుండం. చిక్కితే అంతే సంగతులు! ఆంధ్రప్రదేశ్‌లో కూడా షిండేలున్నారని, భవిష్యత్తులో ఇక్కడా అలాంటి పరిణామాలు పునరావృతమవుతాయనీ ఇంతకుమునుపు ఊహాగానాలు వినిపించాయి. అలాంటివి భవిష్యత్తులో జరిగినా ఆశ్చర్యపడనక్కరలేదు. అధికారం, పదవీవ్యామోహం వారిని ఆ విధంగా లాక్కుపోతాయి. అయితే ఎ.పి షిండేలుగా అవుతారనుకున్న వారు మాత్రం మహారాష్ట్ర షిండే అనుభవాన్ని గుర్తెరగడం ఎంతో అవసరం. అలాగే చెలిమి చేసిన, చేస్తున్నవారూ యోచించడమూ అంతే అవసరం. అది ధృతరాష్ట్ర కౌగిలి సుమా! తస్మాత్ జాగ్రత్త!!

మహనీయుల మాట



నిజమైన నేతలు తమ ప్రజల స్వేచ్ఛ కోసం అన్నింటినీ త్యాగం చేయడానికి సిద్ధపడాలి.
- నెల్సన్ మండేలా



విశ్లేషణ

జిల్లాల ఆర్థిక అసమానతలు, వెనుకబాటుతనం



డా॥ బి.గంగారావు


ఆంధ్ర రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా జిల్లాల వారీగా 26 జిల్లాల స్థూల ఉత్పత్తి గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ వివరాల దృష్టాంతం జిల్లాల మధ్య అసమానతలు, వెనుకబాటుతనం, సంపద కేంద్రీకరణ అలాగే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లోను, వాటి ఉత్పత్తి విలువల్లో చోటు చేసుకుంటున్న ఆందోళనకర పరిణామాలు వాటి పర్యవసానంగా రాష్ట్ర ఆర్థిక రంగంలో ఎలాంటి మార్పులు జరుగుతున్నాయో తెలియజేస్తున్నాయి.

డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.14.39 లక్షల కోట్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (ఎస్ జిడిపి) నమోదయింది. ఇందులో వ్యవసాయ రంగం నుండి రూ.4.53 లక్షల కోట్లు, పారిశ్రామిక రంగం నుండి రూ. 3.41 లక్షల కోట్లు, సేవా రంగం నుండి రూ. 5.33 లక్షల కోట్లు ఆదాయం వచ్చిందని, అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం రూ.242479 గా వుందని తెలిపింది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో విశాఖ జిల్లా రూ.119268 కోట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తరువాత ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాలు రెండు, మూడు స్థానాల్లోనూ, తిరుపతి, ఏలూరు జిల్లాలు నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. అట్టడుగు ఐదు స్థానాల్లో 22 నుండి 26 స్థానాలు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అన్నమయ్య, నంద్యాల జిల్లాలు వరుసగా ఉన్నాయి. ఈ జిల్లాల మొత్తం స్థూల ఉత్పత్తి విశాఖ జిల్లా స్థూల ఉత్పత్తికి సమానంగా ఉంది. దీన్నిబట్టి అట్టడుగున ఉన్న జిల్లాల ఆర్థిక దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. అడుగున ఉన్న ఐదు జిల్లాల్లో మూడు ఉత్తరాంధ్రలోను, రెండు రాయలసీమలో ఉన్నాయి. రాష్ట్ర సగటు స్థూల ఉత్పత్తి రూ.50135 కోట్లుగా ఉంది. 13 జిల్లాలు వాటి స్థూల ఉత్పత్తి రాష్ట్ర సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నాయి. ఇందులో ఐదు జిల్లాలు రాయలసీమకి మరో నాలుగు ఉత్తరాంధ్రకి చెందినవి.

జిల్లాల స్థూల ఉత్పత్తి విలువలను పరిశీలిస్తే జిల్లాల మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో విశాఖ జిల్లా వాటా 9.15 శాతం ఉంటే అట్టడుగున ఉన్న అల్లూరి జిల్లా 1.16 శాతం, మన్యం జిల్లా 1.17 శాతం వాటా కలిగి వున్నాయి. 2 నుండి 3 శాతం మధ్య విజయనగరం, అన్నమయ్య, నంద్యాల, బాపట్ల, శ్రీకాకుళం, కోనసీమ జిల్లాలు ఉంటే 3 నుండి 4 శాతం వాటా మధ్య 13 జిల్లాలు ఉన్నాయి. కేవలం ఏలూరు 5.13 శాతం, తిరుపతి 5.18 శాతం, కృష్ణా 5.24 శాతం, ఎన్‌టిఆర్ జిల్లా 5.65 శాతం వాటాతో కొంత మెరుగుదలలో ఉన్నాయి.

జిల్లాల మధ్య అంతరాలు తగ్గకపోగా వ్యవసాయ రంగ ఉత్పత్తి పెరిగినా వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ ప్రజల ఆదాయాలు పడిపోవడం, ఉపాధి కోల్పోవడం చోటు చేసుకుంటున్నది. భూ కేంద్రీకరణ పెరుగుతూ వ్యవసాయ రంగంలో పెట్టుబడి చొచ్చుకు పోతున్నది. సహజ వనరులు, ప్రభుత్వ ఆస్తుల కేంద్రీకరణగా కొన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక పెట్టుబడి విస్తరిస్తున్నది. ఈ ఆందోళనకర పరిస్థితులను రూపుమాపే దిశగా ప్రస్తుత చంద్రబాబు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోగా... స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 పేరుతో చేపట్టబోతున్న విధానాలు...జిల్లాల మధ్య, జిల్లాల్లోని మండలాల మధ్య, ప్రజల మధ్య తీవ్ర ఆర్థిక అసమానతలను పెంచుతాయనటంలో ఎలాంటి సందేహం లేదు.



రాష్ట్ర తలసరి ఆదాయంతో జిల్లాల తలసరి ఆదాయాలను పోల్చి చూస్తే జిల్లాల మధ్య అసమానతలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. విశాఖ జిల్లా రూ.4,83,892 తలసరి ఆదాయంతో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో కృష్ణా, మూడో స్థానంలో ఏలూరు, నాల్గో స్థానంలో ఎన్.టి.ఆర్, ఐదో స్థానంలో తిరుపతి జిల్లాలు వున్నాయి.

దిగువ స్థాయిలో 5 స్థానాల్లో వరుసగా అల్లూరి, మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర తలసరి ఆదాయం పైభాగాన 9 జిల్లాలు ఉంటే, దిగువున 17 జిల్లాలు ఉన్నాయి. ఇందులో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలే కాకుండా కాకినాడ, కోనసీమ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కూడా వుండటం విశేషం. జిల్లాలకు సంబంధించిన స్థూల ఉత్పత్తులను, వాటికి చోదక శక్తులుగా వున్న రంగాల ఉత్పత్తులు, ఉత్పత్తి కేంద్రాలు లేదా మండలాలను పరిశీలిస్తే జిల్లాల మధ్య అసమానతలే కాకుండా జిల్లాలోనే వివిధ మండలాల మధ్య నెలకొన్న అంతరాలను కూడా గుర్తించొచ్చు. వ్యవసాయ రంగ ఉత్పత్తుల్లో రాష్ట్రంలో ఏలూరు, కృష్ణా, అనంతపురం, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలు వరుస ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఇందులో కూడా ఆ యా జిల్లాల స్థూల ఉత్పత్తిలో ఏలూరు జిల్లా 63.21 శాతం, కృష్ణా జిల్లా 47 శాతం, పశ్చిమ గోదావరి జిల్లా 44.57 శాతం వ్యవసాయం నుండి ఆదాయం వస్తున్నది. దీనికి ప్రధాన కారణం చేపలు, రొయ్యల సాగుబడి. ఉదాహరణకు 2022-23లో ఏలూరు జిల్లా స్థూల ఉత్పత్తి రూ.66834 కోట్లు. ఇందులో చేపలు, రొయ్యల ద్వారా రూ.20860 కోట్లు ఆదాయం వచ్చింది. మొత్తం జిల్లాలో 24 మండలాలు ఉంటే 11 మండలాల్లో చేపలు, రొయ్యల సాగు జరుగుతున్నది. ఇందులో కూడా కలిదిండి, ముదినేపల్లి, కైకలూరు, మండవల్లి మండలాలు చేపలు, రొయ్యల ఉత్పత్తిలో అగ్రభాగాన ఉన్నాయి.

కృష్ణా జిల్లా స్థూల ఉత్పత్తి రూ.68301 కోట్లు ఉంటే ఇందులో చేపలు, రొయ్యల నుండి రూ.20860 కోట్లు వస్తున్నది. మొత్తం 25 మండలాల్లో కేవలం నందివాడ, మచిలీపట్నం, కృతివెన్ను, నాగాయలంక, బంటుమిల్లి మండలాల నుండే రొయ్యలు, చేపల నుండి అత్యధిక ఆదాయం వస్తున్నది. చేపలు, రొయ్యల ఉత్పత్తుల్లో మరో ముఖ్యమైన జిల్లా పశ్చిమగోదావరి.ఈ జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉన్నాయి. ఈ జిల్లా స్థూల ఉత్పత్తి రూ 51078 కోట్లు. ఇందులో 9 మండలాల నుండి చేపలు, రొయ్యల నుండి రూ.15859 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ జిల్లాలో కూడా పెనుగొండ, ఆకివీడు, ఇరగవరం, ఎలమంచిలి, గణపవరం, భీమవరం మండలాలు అగ్రభాగంలో ఉన్నాయి. ఆ తరువాత ఉండి, ఆచంట, కాళ్ల మండలాలు ఉంటాయి.

అనంతపురం జిల్లా వ్యవసాయ ఉత్పత్తిలో ముఖ్యంగా ఆహార పంటలైన తృణధాన్యాలు, పప్పుల ఉత్పత్తిలో రాష్ట్రంలో అగ్ర శ్రేణిలో ఉంది. ఈ జిల్లా స్థూల ఉత్పత్తి రూ.63767 కోట్లు ఉంటే ఇందులో ఆహార పంటల నుండి రూ.19116 కోట్లు వస్తున్నది. నెల్లూరు జిల్లా ఆహార పంటలు, పశు పోషణ (పౌల్ట్రీ, పాలు, మాంసం), చేపలు, రొయ్యల మిశ్రమంగా ఉంది. మరో ముఖ్యమైన అంశం రొయ్యలు, చేపల ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఏలూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మరో మార్పు కూడా చోటు చేసుకుంటున్నది. ఈ జిల్లాలు చేపలు, రొయ్యల తరువాత పశుపోషణ నుండి అత్యధిక ఆదాయం పొందుతున్నాయి. దీంతో ఈ జిల్లాల్లో ఆహార పంటల సాగు గణనీయంగా పడిపోతున్నది. రాష్ట్రంలో చాలా జిల్లాలో ఈ పరిణామం మనకి కన్పిస్తున్నది. ఈ మార్పు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ, భూ కేంద్రీకరణ పర్యావరణ సమస్యలను ముందుకు తెస్తున్నది.

జిల్లాల పారిశ్రామిక అభివృద్ధి పరిశీలిస్తే చాలా విచిత్ర పరిస్థితి కనిపిస్తున్నది. విశాఖ పట్నం జిల్లా రాష్ట్రంలో పారిశ్రామికీకరణలో అనేక దశాబ్దాల నుండి ముందు భాగంలో ఉంది. రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తిలో సుమారు 20 శాతం వాటా కలిగి ఉంది. రెండో స్థానంలో తిరుపతి, మూడో స్థానంలో అనకాపల్లి, నాల్గో స్థానంలో ప్రకాశం, ఐదో స్థానంలో ఎన్‌టిఆర్, ఆరో స్థానంలో కాకినాడ జిల్లాలు ఉన్నాయి. ఈ ఆరు జిల్లాలే రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తిలో సుమారు 50 శాతం వాటా కలిగి ఉంటే మరో 11 జిల్లాలు కేవలం 20 శాతం ప్రాతినిధ్యానికే పరిమితమయ్యాయి.

విశాఖ జిల్లా మినహా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాలైన చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల జిల్లాలతో పాటు మధ్య కోస్తాలోని బాపట్ల, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, పల్నాడు జిల్లాలు పారిశ్రామికంగా బాగా వెనుకబడి ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో ముందు వరుసలో ఉన్న జిల్లాలను పరిశీలిస్తే రెండో స్థానంలో ఉన్న తిరుపతి ప్రధానంగా శ్రీ సిటీ కేంద్రంగా ఉన్న పరిశ్రమలే కీలకం. మిగిలిన జిల్లాలో పారిశ్రామికీకరణ గుర్తించదగిన స్థాయిలో ఎక్కడా కనిపించదు. అలాగే అనకాపల్లి జిల్లాలో ఫార్మా, రసాయన పరిశ్రమల కేంద్రంగా పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి మండలాలకే పరిమితమై ఉంది. జిల్లా స్థూల ఆదాయంలో సగ భాగం ఈ నాలుగు మండలాల పరిశ్రమల నుండే వస్తున్నది. ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలో వస్తు తయారీకి ప్రధాన పారిశ్రామిక కేంద్రాలుగా ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో గ్రానైట్ మైనింగ్, మద్దిపాడులో ఉన్న పారిశ్రామిక గ్రోత్ సెంటర్, సింగరాయకొండలో రొయ్యల పరిశ్రమ ముఖ్యమైనవి. మొత్తం జిల్లా పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ మూడు మండలాలలో ఉన్న గ్రానైట్, రొయ్యల పరిశ్రమలే 65 శాతం ఉత్పత్తి విలువ కలిగి ఉన్నాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో నిర్మాణ రంగం కేంద్ర బిందువుగా ఉంది. వస్తు తయారీ రంగం నామమాత్రంగా ఉంది. సత్యసాయి, కాకినాడ, తూర్పు గోదావరి, గుంటూరు, కడప, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఒక్కో ప్రాంతంలో కొద్ది పరిమాణంలో కొన్ని పరిశ్రమలు నెలకొన్నాయి. ఈ కేంద్రాలు ఆ జిల్లాల ప్రజల జీవితాలను ప్రభావితం చేసేలా లేవు.

సేవా రంగంలో జిల్లా కేంద్రాలు ఆధారంగా పెద్ద నగరాల చుట్టూ ఆర్థిక కార్యకలాపాల కేంద్రీకరణ కొనసాగుతున్నది. ఎన్‌టిఆర్ జిల్లా 61.68 శాతం, గుంటూరు జిల్లా 57.63 శాతం, విశాఖపట్నం 49.68 శాతంతో ఆయా జిల్లా స్థూల ఉత్పత్తిలో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అల్లూరి, మన్యం, బాపట్ల, అనకాపల్లి, అన్నమయ్య జిల్లాలు సేవా రంగంలో అట్టడుగున ఉన్నాయి. 15 జిల్లాలు వాటి జిల్లా స్థూల ఉత్పత్తిలో సేవా రంగం వాటా 35 శాతం లోపే ఉన్నాయి. రియల్ ఎస్టేట్, రవాణా, బ్యాంకింగ్, కార్యకలాపాలు సేవా రంగ విలువలో సగ భాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రజలకు వచ్చే ఆదాయాలను బట్టి ఈ రంగ విస్తరణ జరుగుతుంది. కానీ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో సేవా రంగం వాటా 44.13 శాతం నుండి 40.16 శాతానికి క్షీణించింది. అత్యధిక జిల్లాల్లో ఇదే పరిస్థితి చోటుచేసుకున్నది.

స్థూలంగా గడిచిన పదేళ్లల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థల్లో వ్యవసాయ పారిశ్రామిక, సేవా రంగాలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. కొన్ని జిల్లాల్లో వ్యవసాయ రంగంలో దాని అనుబంధ రంగాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. ముఖ్యంగా పశుపోషణ (పౌల్ట్రి, పాలు, మాంసం), చేపలు, రొయ్యలు ఉత్పత్తి పెరుగుదల వల్ల వ్యవసాయ ఉత్పత్తి విలువ పెరుగుతున్నది. ఫలితంగా రాష్ట్ర జిడిపిలో 2014-15లో 30.39 శాతం వ్యవసాయ రంగం వాటా ఉంటే 2023-24కి 34.14 శాతానికి పెరిగింది. ఆహార పంటలు దారుణంగా పడిపోతున్నాయి. దీని నుండి వచ్చే ఆదాయం కూడా క్షీణిస్తున్నది.

పారిశ్రామిక రంగం ఎదుగుబొదుగు లేకుండా 25.69 శాతానికే పరిమితమైంది. ముఖ్యంగా వస్తు తయారీ రంగంలో పెరుగుదల లేదు. కేవలం 4 జిల్లాల్లో అదీ కొన్ని మండలాలకే పారిశ్రామికీకరణ పరిమితమైంది. ప్రభుత్వ ప్రకటనలకు భిన్నంగా వాస్తవ పారిశ్రామికాభివృద్ధి ఉంది.

రాష్ట్ర విభజన అనంతరం కూడా వెనుకబడిన జిల్లాలు రాష్ట్ర విభజన పూర్వ స్థితిలోనే కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాల్లో ఇది స్పష్టంగా కన్పిస్తున్నది. జిల్లాల మధ్య అంతరాలు తగ్గకపోగా వ్యవసాయ రంగ ఉత్పత్తి పెరిగినా వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ ప్రజల ఆదాయాలు పడిపోవడం, ఉపాధి కోల్పోవడం చోటు చేసుకుంటున్నది. భూ కేంద్రీకరణ పెరుగుతూ వ్యవసాయ రంగంలో పెట్టుబడి చొచ్చుకుపోతున్నది. సహజ వనరులు, ప్రభుత్వ ఆస్తుల కేంద్రీకరణగా కొన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక పెట్టుబడి విస్తరిస్తున్నది. ఈ ఆందోళనకర పరిస్థితులను రూపుమాపే దిశగా ప్రస్తుత చంద్రబాబు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోగా...స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 పేరుతో చేపట్టబోతున్న విధానాలు...జిల్లాల మధ్య, జిల్లాల్లోని మండలాల మధ్య, ప్రజల మధ్య తీవ్ర ఆర్థిక అసమానతలను పెంచుతాయనటంలో ఎలాంటి సందేహం లేదు.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

సమస్య

అదాని సేవలో ఆ ముగ్గురు



ఎం. వేణుగోపాలరావు

ఒప్పందం ప్రకారం 3,000 మె.వా అదాని సౌర విద్యుత్ సరఫరాను సెకి గత సెప్టెంబరులో ప్రారంభించాలి. అయితే, అది వాయిదా పడింది. వచ్చే జనవరి నుంచి సరఫరా ప్రారంభమవుతుందని సెకి తెలిపింది. ఆ విద్యుత్ సరఫరా జరగాలంటే, అదాని ప్లాంట్లలో ఉత్పత్తి ప్రారంభించాలి. ప్రసారం చేసేందుకు పిజిసిఐఎల్ (పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)తో అవసరమైన ప్రసార సామర్థ్యం కోసం కాంట్రాక్టు చేసుకోవాలి. రాష్ట్రంలో పంపిణీకి అవసరమైన సబ్ స్టేషన్ ఏర్పాటు చేసుకోవాలి. వీటిలో ఏది జరగకపోయినా సరఫరా చేయటానికి వీలుండదు. అదాని ప్రాజెక్టు వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించే తేదీ (సిఒడి) నుండి లభ్యమయ్యే విద్యుత్‌ను తీసుకునేలా డిస్కాములు చూడాలని పవర్ సప్లై అగ్రిమెంట్ (పిఎస్‌ఎ-ఆర్టికల్ 3.1.1)లో పేర్కొన్నారు. అదేవిధంగా, డిస్కాములు సిఒడి నుండి రాష్ట్ర సరిహద్దుల్లో పిజిసిఐఎల్, ఎపి ట్రాన్స్‌కో అనుసంధానం ఉన్న చోటు నుండి రాష్ట్రంలోకి ఆ విద్యుత్ సరఫరా జరిగేట్లు చూడాలి. ఈ ఏర్పాట్లు ముందుగానే ప్రారంభించి, సిఒడి నాటికి పనిచేసేలా ఉండాలి.

ఈ విద్యుత్ ప్రసారం, పంపిణీకి డిస్కాములు తాము చేయించాల్సిన ఏర్పాట్లు చేయించుకుంటే, అదాని ప్రాజెక్టు సకాలంలో సిఒడి సాధించలేకపోతే, ఆ ఏర్పాట్లు ఆ ప్రాజెక్టు ఉత్పత్తి ప్రారంభించే వరకు నిరుపయోగంగా ఉంటాయి. అయినా, ప్రసార, పంపిణీకి కాంట్రాక్టు చేసిన మేరకు చార్జీలను డిస్కాములు చెల్లించాలి. అదేవిధంగా, అదాని ప్రాజెక్టు అంగీకరించిన 28 శాతం కెపాసిటీ యుటిలైజేషన్ ఫ్యాక్టర్ (సియుఎఫ్-ఉత్పత్తి సామర్థ్యం వినియోగం) కన్నా తక్కువగా ఉత్పత్తి చేసినా, ఉత్పత్తి తగ్గిన మేరకు ప్రసార, పంపిణీ సామర్థ్యాలలో ఉపయోగించుకోలేని సామర్థ్యానికి కూడా డిస్కాములు చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తుంది. అందువల్ల, సిఒడి, ప్రసార, పంపిణీ సామర్థ్యాల లభ్యత ఒకేసారి జరగాలి. అదాని ప్రాజెక్టు నిర్ణీత గడువులో సిఒడిని సాధించలేకపోతే, డిస్కాములకు జరిమానా చెల్లించాలని షరతు విధించలేదు. సెకికి, అదానికి మధ్య విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) నిబంధనల ప్రకారం సిఒడి సాధించేందుకు సెకి డిస్కాములకు తెలియజేస్తూ గడువును పొడిగించవచ్చునని పిఎస్‌ఎలో (ఆర్టికల్ 2.1.4) పేర్కొన్నారు. అంటే, అదాని ప్రాజెక్టు సిఒడి సాధించే వరకు డిస్కాములు విద్యుత్ సరఫరా కోసం ఎదురు చూడాల్సిందే. నష్టపోవాల్సిందే. 7000 మె.వా. కొనుగోలుకు సెకితో చేసుకున్న ఒప్పందం రాష్ట్ర అవసరాలను తీర్చే విధంగా గాక, అదాని నెలకొల్పే ప్రాజెక్టుల సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు వీలు కల్పించే రీతిలోనే ఉంది.

కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) జారీ చేసిన జిఎన్‌ఎ రెగ్యులేషన్లు అమలులోకి వచ్చాక 100 శాతం ఐఎస్‌టిఎస్ చార్జీల మినహాయింపు సాధ్యం కాకపోవచ్చునని డిస్కాములు ఆందోళన చెందుతున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందని, ఈ అంశాన్ని దక్షిణాది విద్యుత్ రెగ్యులేటర్ల వేదిక (ఎసిఆర్‌ఎఫ్) సమావేశంలో చర్చించి, దానిపై ఒక వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేసినట్లు గత ఆగస్టు 13న ఎపిఈఆర్‌సి రాష్ట్ర ప్రభుత్వానికి, మూడు డిస్కాంలకు రాసిన లేఖలో పేర్కొంది. జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జిఎన్‌ఎ) రెగ్యులేషన్ల ప్రకారం సాధ్యమయ్యే వాటిలో నూరు శాతం మినహాయింపు ఒకటని కమిటీ పేర్కొంది. అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలకు (ఐఎస్‌టిఎస్) నూరు శాతం మినహాయింపు పొందటానికి సెకి బాధ్యత తీసుకొనకపోతే, ఈ మినహాయింపు పొందేందుకు రాష్ట్ర గ్రామీణ వ్యవసాయ విద్యుత్ పంపిణీ కంపెనీ దరఖాస్తు చేసుకోవచ్చునని ఎపిఈఆర్‌సి (ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్) ఆ లేఖలో తనంత తాను సలహా ఇచ్చింది. పిఎస్‌ఎకి ఎపిఈఆర్‌సి గత ఏప్రిల్ 20న ఆమోదం తెలిపింది. జిఎన్‌ఎ రెగ్యులేషన్లు అంతకన్నా చాలా కాలం క్రితమే అమలులోకి వచ్చాయి. ఈ అంశాన్ని పరిశీలించకుండానే, మినహాయింపు పొందాల్సిన బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత లేకుండానే ఎపిఈఆర్‌సి పిఎస్‌ఎకి ఆమోదం తెలిపి, ఆ తరువాత నాలుగు నెలలకు ఇలా ఉచిత సలహా ఇచ్చింది. అన్ని అంశాలను, పిఎస్‌ఎను కూడా సమగ్రంగా పరిశీలించి పిపిఎలో, పిఎస్‌ఎలో సముచిత మార్పులు చేయించటంలో ప్రభుత్వ వైఫల్యంతో పాటు, నియంత్రణ కమిషన్‌గా ఎపిఈఆర్‌సి వైఫల్యం కూడా దీనితో స్పష్టమవుతున్నది. కమిషన్ సలహా చేతులు కాలాక ఆకులు పట్టుకోండనే రీతిలో ఉంది.

ఇన్ని అవకతవకలతో, ముడుపుల చెల్లింపుల అభియోగాలతో కూడుకున్న ఈ అక్రమ వ్యవహారంపై విచారణలు జరిపించి, తగు చర్యలు తీసుకోవాలని పార్లమెంటు లోపల, బయట రాజకీయ పార్టీలు, పలువురు మేధావులు పదేపదే డిమాండు చేస్తున్నారు. విచారణ జరిపించేందుకు అనేక అవకాశాలున్నాయి. కాని ఇందులో విచారించాల్సిందేమీ లేదన్నట్లుగా మోదాని ప్రభుత్వం యథావిధిగా మొండిబండగా వ్యవహరిస్తున్నది. ఈ వ్యవహారంలో అదానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సంబంధం లేదని బుకాయించటంతో పాటు, ఈ ఒప్పందం చేసుకున్నందుకు తనకు శాలువా కప్పాలని జగన్ అంటున్నారు. ఈ వ్యవహారంపై అధ్యయనం చేయాలంటూ, విచారణ జరిపించాలన్న సహేతుక డిమాండుపై చంద్రబాబు నాయుడు దాటవేత వైఖరి అవలంభిస్తున్నారు.



సెకి టెండరులో ఎంపికైన ఉత్పత్తిదారుకు (అదాని గ్రూపు) టెండరు వేసిన ఉత్పత్తి సామర్థ్యానికి సమానమైన అదనపు ఉత్పత్తి సామర్థ్యాలను కేటాయించేందుకు కేంద్ర నూతన, పునరుత్పత్తి ఇంధన మంత్రిత్వ శాఖ గ్రీన్ షూ ఆప్షన్ పేరుతో వీలు కల్పిస్తూ చాలా కాలం క్రితమే ప్రకటన చేసింది. దీనికి సంబంధించి అదాని, సెకీ మధ్య పిపిఎలో ఎలాంటి నిబంధనలు పొందుపర్చారో, వాటి ప్రభావం డిస్కాంలపై ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.

అదాని ప్రాజెక్టు నుండి 7000 మె.వా సౌర విద్యుత్‌ను డిస్కాములకు అవసరమున్నా లేకపోయినా నిబంధనల ప్రకారం కొని తీరాల్సిందే. మిగులు ఉంటే దానిని మార్కెట్లో అమ్ముకోవచ్చనేది ఒక వాదన. మెరిట్ ఆర్డర్ డిస్పాచ్ సూత్రం ప్రకారం అత్యధిక అస్థిర చార్జీలు ఉన్న థర్మల్ విద్యుత్ మిగులుగా తేలుతుంది. సౌర విద్యుత్‌ను మిగులు విద్యుత్‌గా చూపి మార్కెట్లో అమ్ముకొనేందుకు ఆ సూత్రం ప్రకారం వీలుండదు. గ్రామీణ వ్యవసాయ విద్యుత్ పంపిణీ కంపెనీ ద్వారా 7000 మె.వా విద్యుత్‌ను పంపిణీ చేస్తే, రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు అది సరిపోవచ్చు. అలాంటి ఏర్పాటు వల్ల తలెత్తే ఇబ్బందులు, ప్రస్తుతమున్న మూడు డిస్కాములకు, వాటి వినియోగదారులకు వాటిల్లే నష్టాలను గతంలోనే వివరించాము. ఎపిఈఆర్‌సి పునరుత్పత్తి విద్యుత్ కొనుగోలు బాధ్యత (ఆర్‌పిపిఒ) ఉత్తర్వు కింద నిర్దేశించిన కనీస లక్ష్యానికి మించి సౌర విద్యుత్ వంటి ఆర్ఇని డిస్కాము కొనుగోలు చేస్తే, అదనంగా కొనుగోలు చేసిన విద్యుత్‌కు పునరుత్పత్తి ఇంధన సర్టిఫికెట్లను (ఆర్ఇసి) పొంది, అమ్ముకోవచ్చు. ఆ సర్టిఫికెట్ల అమ్మకానికి ఉన్న పరిమితులకు తోడు, అలా అమ్ముకొనటం వల్ల వచ్చే ఆదాయం అదాని సౌర విద్యుత్ వల్ల వాటిల్లే భారీ నష్టాన్ని సర్దుబాటు చేసుకొనేందుకు ఏ మూలకూ చాలదు. పైగా, సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయటం రాష్ట్రంలో అవసరాలను తీర్చడానికి తప్ప ఆర్ఇసి సర్టిఫికెట్ల కోసం కాదు.

ఆర్‌పిపిఒ కింద డిస్కాములు, ఇతరులు వాటి విద్యుత్ వినియోగంలో కొనాల్సిన కనీస ఆర్ఇని నిర్దేశిస్తూ, ఎనర్జీ కన్సర్వేషన్ చట్టం కింద గతేడాది అక్టోబరు 20న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దాని ప్రకారం వివిధ రకాల ఆర్ఇ ని 2024-25లో 29.92 శాతం మేరకు, తరువాత ప్రతి ఏటా ఆ శాతాన్ని పెంచుతూ 2029-30లో 43.33 శాతం మేరకు కొనాలని నిర్దేశించింది. ఎపిఈఆర్‌సి నిర్దేశించిన అధిక శాతాల కన్నా ఇవి ఇంకా చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇవి మార్గదర్శకాలు మాత్రమే. అయితే, కమిషన్ నిర్ణయించిన, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పేర్కొన్న వాటిలో ఏది ఎక్కువగా ఉంటే ఆ శాతం మేరకు ఆర్ఇ ని డిస్కాంలు కొనాలని ఎపిఈఆర్‌సి ఏకపక్షంగా ఆదేశించింది. ఈ అంశం ప్రస్తావన కూడా లేని రెండు పిటిషన్‌లలో ఇచ్చిన ఉత్తర్వులలో ఎపిఈఆర్‌సి అలా ఆదేశించింది. ఆర్‌పిపిఒ కింద కనీస లక్ష్యాలను నిర్ణయించే ముందు, కమిషన్ తన ప్రతిపాదనలకు ప్రకటించి, ఆసక్తి గలవారి నుండి అభ్యంతరాలను, సూచనలను ఆహ్వానించి, బహిరంగ విచారణలు జరిపి, ఉత్తర్వులు జారీ చేయటం గత నుండి జరుగుతున్నది. దానికి విరుద్ధంగా, అప్రజాస్వామికంగా, అనవసరంగా అధిక ఆర్ఇ కొనుగోలు వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతిని, వాటిల్లే భారీ నష్టాలను పట్టించుకోకుండా ఎపిఈఆర్‌సి ఈ ఆదేశాలు జారీ చేసింది. అదాని నుండి సెకి ద్వారా 7000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు తానిచ్చిన అనుచిత ఆమోదాన్ని సమర్థించుకునేందుకు ఎపిఇఆర్‌సి ఇలా మళ్ళీ అనుచిత ఆదేశాలనిచ్చింది.

ఇన్ని అవకతవకలతో, ముడుపుల చెల్లింపుల అభియోగాలతో కూడుకున్న ఈ అక్రమ వ్యవహారంపై విచారణలు జరిపించి, తగు చర్యలు తీసుకోవాలని పార్లమెంటు లోపల, బయట రాజకీయ పార్టీలు, పలువురు మేధావులు పదేపదే డిమాండు చేస్తున్నారు. విచారణ జరిపించేందుకు అనేక అవకాశాలున్నాయి. కాని ఇందులో విచారించాల్సిందేమీ లేదన్నట్లుగా మోదాని ప్రభుత్వం యథావిధిగా మొండిబండగా వ్యవహరిస్తున్నది. ఈ వ్యవహారంలో అదానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సంబంధం లేదని బుకాయించటంతో పాటు, ఈ ఒప్పందం చేసుకున్నందుకు తనకు శాలువా కప్పాలని జగన్ అంటున్నారు. ఈ వ్యవహారంపై అధ్యయనం చేయాలంటూ, విచారణ జరిపించాలన్న సహేతుక డిమాండుపై చంద్రబాబు నాయుడు దాటవేత వైఖరి అవలంభిస్తున్నారు. రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా, బడా కార్పొరేట్ శక్తులతో పాలక వర్గాల సంబంధాలు పరస్పర స్వార్థ ప్రయోజనాల కోసం ఎంత బలంగా ముడిపడి ఉన్నాయనేది ఈ వ్యవహారం మరోసారి నిర్ధారిస్తున్నది.

/ వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు /

ఫిల్మ్ పాలసీ దిశగా రాష్ట్రం

- పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఫిల్మ్ పాలసీ తీసుకొస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంది కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ అంశంపై సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. అన్ని పాలసీల మాదిరిగా ఫిల్మ్ పాలసీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమగ్ర నివేదిక రూపొందించాక సినిమా రంగంతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని తెలిపారు. సినిమా టికెట్ల ధరల పెంపుపై దీర్ఘకాలికంగా ఒక విధానం ఉంటే బాగుంటందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేయగా ఈ అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్, ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల గమ్యస్థానంగా రాష్ట్రం

పర్యాటకుల గమ్యస్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటక శాఖపై సమీక్ష నిర్వహించారు. కేంద్రప్రభుత్వ పథకం సాస్కి నిధులతో చేపట్టనున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టుల అమలు, విధి విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అన్ని అనుమతులు తీసుకొని జనవరిలో పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులతో రాష్ట్రంలో పర్యాటకాన్ని పరుగులు పెట్టించాలని తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఎండి అమ్రపాలి, ఇడిలు పద్మావతి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

గ్రాంట్లలో ఏటా కోతలు

- రాష్ట్రాలను అప్పుల పాలు చేస్తున్న కేంద్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేయాల్సిన గ్రాంట్లలో కేంద్ర ప్రభుత్వం భారీగా కోతలు పెడుతోంది. అదే సయంలో ప్రత్యామ్నాయమంటూ అప్పులు ఇస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ధోరణి చర్చనీయాంశంగామారింది. వివిధ పథకాలకు, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రాష్ట్రాలకూ నిధులు గ్రాంట్ల రూపంలో అందుతాయి. అనేక రాష్ట్రాలు ఈ నిధులపైనే ఎక్కువగా ఆధారపడి ముందుకు సాగుతున్నాయి.

రాష్ట్రానికి సంబంధించి తయారుచేసిన నాలుగేళ్ల గణాంకాల్లో ఈ విషయం స్పష్టంగా అర్థమౌతో 2021-22లో 39 కోట్ల వరకు నిధులు కేంద్రం నుంచి రాగా, ఆ తరువాత సంవత్సరాల్లో 36 వేల కోట్లకు, 34 వేల కోట్లకు తగ్గిపోయి ఇప్పుడు 30 వేల కోట్ల రూపాయలు మాత్రమే వస్తాయని రాష్ట్ర ఆర్థికశాఖ అంచనాకు వచ్చింది.

రుణ భారం పెంచేస్తూ...

ఇలా గ్రాంట్లను తగ్గించుకుంటూ వస్తున్న కేంద్రం అదే సమయంలో రాష్ట్రాలకు భారీగా రుణాలను సమకూరుస్తోంది. 2018-19లో 1,990 కోట్లను రుణంగా ఇచ్చిన కేంద్రం, 2022-23 నాటికి ఈ రుణాన్ని 8,410 కోట్లకు పెంచేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఐదు వేల కోట్లు రుణంగా ఇచ్చిన కేంద్రం ఈ ఏడాది దానిని 18,249 కోట్లకు పెంచేలా అంచనాలు సిద్ధంచేసినట్లు రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ఈ రుణ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉండడం, దానిపై వడ్డీ భారం కూడా ఎక్కువగా ఉండడంతో ఖజానాపై భారం పెరుగుతున్నట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు (కోట్లలో)

ఏడాది	నిధులు
2021-22	39,170
2022-23	36,148
2023-24	34,702
2024-25	30,334

అనర్హులకు కేటాయించిన ఇళ్ల పట్టాలు వెనక్కి

- రెవెన్యూ సదస్సుల్లో అక్రమాలు బయటకు
- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వంలో అనర్హులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకుంటామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. వైసిపి కార్యకర్తలకు పెద్దయెత్తున ఇళ్ల పట్టాలను కట్టబెట్టినట్లు తెలుస్తోందన్నారు. అన్ని రకాల భూ వివాదాలకు పరిష్కారం చూపేందుకు ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 17,654 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుల నిర్వహణ నేపథ్యంలో మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. 33 రోజులపాటు అన్ని గ్రామాల్లో ఈ సదస్సులు ఉంటాయని తెలిపారు. ఆ తర్వాత 45 రోజుల కాల వ్యవధిలో ఫిర్యాదులు పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన ఇంటి లబ్ధిదారుల జాబితాను వెల్లడించి అనర్హులను తేలుస్తామని, వారి నుంచి ఇంటి స్థలాన్ని వెనక్కి తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు కేటాయిస్తామని అన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుపైనా సదస్సుల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ప్రారంభించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- కాంట్రాక్టు లెక్చరర్ల దీక్షకు మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరణకు సంబంధించిన జివో 114ను అమలు చేయాలని డిమాండ్ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ విజయవాడలోని ధర్నాచౌక్‌లో సత్యాగ్రహదీక్ష నిర్వహించింది. ఈ దీక్షలో పాల్గొని లక్ష్మణరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు జివో 114ను విడుదల చేసిందని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో మాత్రం అమలుకు నోచుకోలేదని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిఎస్ఆర్ శర్మ మాట్లాడుతూ తమను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. క్రమబద్ధీకరణ చేయకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో పెద్దఎత్తున పోరాటనికి సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిజె గాంధీ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ రెడ్డి మృతి



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

కృష్ణా జిల్లా విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, అభ్యుదయవాది, వామపక్ష శ్రేయోభిలాషి దుగ్గిరాల సత్యనారాయణ రెడ్డి (85) బుధవారం మరణించారు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడ ఎల్ఐసి కాలనీ జయప్రకాష్ నగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఉమ్మడి కష్ణా జిల్లా విజయవాడ ప్రాంతంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉద్యమాలతో ఆయనకు అనుబంధం ఉంది. గుంటూరు జిల్లా గురజాల మండలం అంబాపురంలో జన్మించిన సత్యనారాయణరెడ్డి ప్రజాతంత్ర ఉద్యమాలకు బాసటగా ఉండేవారు. ఉద్యోగ విరమణ తర్వాత హక్కుల ఉద్యమాలు ఇస్కఫ్, శాంతిస్నేహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా ఉన్నారు. వినియోగదారుల కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. గుజరాత్‌లోని గోద్రా దుర్ఘటన సమయంలో ప్రజలను చైతన్య పరిచేందుకు కషి చేశారు. న్యాయమూర్తిగా ఉన్న సమయంలో పెండింగ్‌లో ఉన్న అనేక కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఏర్పాటు చేసి ఒక్కరోజులోనే 350 కేసులు పరిష్కరించారు. ఆదివాసీలు, గిరిజనుల హక్కుల కోసం గ్రామ స్థాయిలో సత్వర న్యాయం జరగాలని ఆకాంక్షిస్తూ బిడి శర్మ ఉద్యమం మాదిరిగా 'మన ఊరు మన రాజ్యం' కావాలని కోరుకునేవారు. ఇటీవల వరకు వామపక్ష, అభ్యుదయ శక్తులు నిర్వహించిన సభలకు, సమావేశాలకు హాజరయ్యేవారు. ఆయన అంత్యక్రియలు విజయవాడలోని జయప్రకాష్‌నగర్‌లో జరిగాయి. ఆయన భౌతికకాయాన్ని పలువురు వామపక్షాల నాయకులు, న్యాయవాదులు, సాహితీవేత్తలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

పట్టణాభివృద్ధి సంస్థలే వనరులు సమీకరించుకోవాలి

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించాలని అధికారులను పురపాలకశాఖ మంత్రి పి నారాయణ ఆదేశించారు. కర్నూలు, కడప, అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థల అధికారులు, ఛైర్మన్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళగిరిలోని ఎంఎయుడి కార్యాలయం నుంచి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యాన ఇళ్ల నిర్మాణం, లేవుట్‌లను అభివృద్ధి చేసి విక్రయించడంతో ఆర్థికంగా పరిపుష్టి సాధించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో మిడిల్, హై ఇన్ కం గ్రూప్‌లకు ఇళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనందున స్వయం వనరుల సమీకరణపై దృష్టి పెట్టాలన్నారు. యుడిఎలకు నోడల్ అధికారిగా పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు.

మంగళగిరిలోని ఎయిమ్స్‌కు నీటిని అందించేందుకు చేపట్టిన పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ప్రస్తుతం ఎయిమ్స్‌కు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ శాశ్వతంగా నీటిని అందించేందుకు గుంటూరు ఛానల్, ఆత్మకూరు చెరువు నుంచి నీటిని తరలించేందుకు పైపులైన్ నిర్మాణం పూర్తి చేశారు. ప్రతిరోజూ 25 లక్షల లీటర్ల శుద్ధమైన నీటిని సరఫరా చేసేలా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు మంత్రికి గుంటూరు పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి శ్రీనివాసరావు వివరించారు. ఈ నెల 15లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరు, అధికారులను మంత్రి ఆదేశించారు.

బిసిలకు రూ.39 వేలకోట్లు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడుగు, బలహీన తరగతుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బిసి, ఇబిసి, చేనేత, జౌళిశాఖల మంత్రి ఎస్ సవిత తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ తరగతుల అభ్యున్నతికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.39 వేలకోట్లు నిధులు కేటాయించామన్నారు. బిసిల్లో ఎ, బి, డి, ఇ తరగతులకు ఏడు కార్పొరేషన్ల ద్వారా వివిధ పథకాలకు రూ.17,319 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యాన స్వయం ఉపాధి పథకాలకు రూ.1,977.53 కోట్లు సబ్సిడీతో రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల 1,33,849 మందికి లబ్ధి చేకూరనుందని చెప్పారు. డిఎస్‌సి, సివిల్ సర్వీస్‌కు ఉచిత శిక్షణ కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ఏడు కార్పొరేషన్‌లకు రూ.10,273.80 కోట్లు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి పోలా భాస్కర్, సంచాలకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రూ.3.24 కోట్ల ఎర్ర చందనం స్వాధీనం

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

లారీలో అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనం దుంగలను బుధవారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఎర్ర చందనం అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో, కాజ టోల్ గేట్ వద్ద మంగళగిరి రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ సిహెచ్ వెంకట్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక నిఘా విభాగం సిబ్బంది మాటు వేశారు. పేపర్ బండిల్స్ లోడ్‌తో వెళ్తున్న లారీని అనుమానం వచ్చి ఆపారు. లారీలో తనిఖీ చేయడానికి పూనుకోగా డ్రైవర్ పరారయ్యాడు. ఈ లారీలో పేపర్ బండిల్స్ మధ్యలో 49 ఎర్ర చందనం దుంగలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 1,200 కిలోలుగా నిర్ధారించారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.3.24 కోట్ల వరకూ ఉంటుందని తెలిపారు. ఈ లారీ చెన్నయ్ నుండి అస్సాంకు వెళ్తోందని, ఎర్ర చందనం అక్రమ రవాణా వెనుక పాత్రదారులపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

రైల్వే జోన్ ఆపరేషన్స్‌పై భాగస్వామ్య పక్షాలతో చర్చిస్తాం

- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ రైల్వే జోన్ ఆపరేషన్స్‌పై భాగస్వామ్య పక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం టిడిపి ఎంపి భరత్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. రైల్వే జోన్ కార్యాలయల భూమి కేటాయింపు విషయంలోనే గతంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. సౌత్ కోస్టల్ జోన్ ఏర్పాటు కోసం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒఎస్‌డి)ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆపరేషన్స్ చేపట్టేందుకు అధ్యయనం చేసి, ఆ తరువాత కార్యాకలాపాలు ప్రారంభించేలా చూస్తామన్నారు.

రైల్వే సమస్యలను పరిష్కరించండి : శ్రీకృష్ణ దేవరాయలు

రైల్వే సమస్యలను పరిష్కరించాలని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. లోక్‌సభలో రైల్వే సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లును స్వాగతిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు నడికుడి-శ్రీకాళహస్తి, కడప-బెంగళూరు, రేణిగుంట-గూడూరు, కోటిపల్లి-నర్సాపూర్ లైన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నరసరావుపేటలో స్టాపేజితో గుంటూరు-బెంగళూరు మధ్య వందే భారత్ కనెక్టివిటీని ప్రవేశపెట్టాలని, కోవిడ్ లాక్ డౌన్‌లో నిలిపివేసిన రైల్వే స్టాప్‌లను పునరుద్ధరించాలని కోరారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసం 24 రైల్వే అండర్‌పాస్‌లను ఓవర్‌పాస్‌లుగా మార్చడానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. పండ్లు, కూరగాయలకు 50 శాతం రవాణా సబ్సిడీతో పాటు, ఉద్యానవన ఉత్పత్తులకు కీలకమైన సేవ అయిన అనంతపురం నుండి న్యూఢిల్లీకి కిసాన్ రైలును పునరుద్ధరించాలని కోరారు. కోవిడ్‌లో నిలిపివేసిన సీనియర్ సిటిజన్ ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. రైల్వే బోర్డులో ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని చేర్చాలని వైసిపి ఎంపి గుమ్మా తనుజా రాణి డిమాండ్ చేశారు. లోక్‌సభలో రైల్వే సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. బిల్లులో ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని నిర్ధారించే నిర్దిష్ట నిబంధనలు లేకపోతే, రైల్వే కనెక్టివిటీ బాగా ఉన్న ప్రాంతాలకు, తక్కువ ఉన్న ప్రాంతాల మధ్య అంతరం పెరిగే ప్రమాదం ఉందని అన్నారు.

సీనియర్ సిటిజన్స్, జర్నలిస్టుల రాయితీ పునరుద్ధరణ కష్టమే

సీనియర్ సిటిజన్స్, అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రైల్వేలో గతంలో కల్పించిన రాయితీల పునరుద్ధరణ కష్టమని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తేల్చి చెప్పారు. సీనియర్ సిటిజన్స్, అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రాయితీలపై ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.

సమాచారం లేదు
విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న వివక్షపై కేంద్రం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న వివక్ష విషయంలో తమ వద్ద ఎలాంటి సమాచారమూ లేదని కేంద్రం తెలిపింది. జేడీ(యూ) ఎంపీ అకోల్ కుమార్ సుమన్ అడిగిన ప్రశ్నకు.. కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ లోక్‌సభలో పై విధంగా తెలిపారు. విద్యా సంస్థల్లో వివక్షకు సంబంధించి ఎలాంటి సమాచారమూ నిర్వహిం చబడదని చెప్పారు. 2013 నుంచి 2022 వరకు ఎస్సీ, ఎస్టీల నేరాలు, వేధింపులు పెరిగాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) సమాచారాన్ని ఆయన ఉటంకించారు. గత పదేండ్లలో, ముఖ్యంగా ఐఐటీలు, ఎయిమ్స్, ఇతర పబ్లిక్ సెక్టార్ ఇన్‌స్టిట్యూషన్స్‌లలో ఎస్సీ, ఎస్టీలు వివక్ష ఎదుర్కొంటున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. దీనిపై ఫోకస్ చేస్తూ జేడీ(యూ) ఎంపీ ప్రశ్నను లేవనెత్తగా.. కేంద్రం అలాంటి సమాచారమేదీ లేదని సమాధానమివ్వటం గమనార్హం.

హై కోర్టు బెంచ్ ఏర్పాటు వేగవంతం

- మంత్రి ఎన్.ఎండి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలులో హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూర్ అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి, కమిషనర్ సి.హెచ్ శ్రీధర్‌లకు సూచించారు. సచివాలయంలో బుధవారం తనను కలిసిన అధికారులతో మాట్లాడుతూ...కర్నూలులో హై కోర్టు బెంచ్ ఏర్పాటుకు శాసన సభ, శాసన మండలిలో తీర్మానాన్ని ఆమోదించడం జరిగిందన్నారు. అదేవిధంగా న్యాయ, మైనారిటీ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపైన ఈ సందర్భంగా మంత్రి చర్చించారు.

సచివాలయ కార్యదర్శి ఆత్మహత్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

సచివాలయ కార్యదర్శి ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు...రాయదుర్గం పట్టణానికి చెందిన రాఘవేంద్రబాబు (44) కంబదూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1లో కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈ సచివాలయంతో పాటు రాళ్లఅనంతపురం, మర్రిమాకులపల్లి సచివాలయాలకు ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని కంబదూరు సచివాలయ కార్యాలయంలోనే నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం సచివాలయానికి వెళ్లిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పని ఒత్తిడి నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఘటనపై కంబదూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు గంటలకు పైగా నిలిచిపోయిన వందే భారత్

షొర్నూర్: మోడీ ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్ల బాలారిష్టాలను దాటలేకపోతున్నాయి. ఇంజిన్ మొరాయించడంతో కేరళలోని కాసరగోడ్-తిరువనంతపురం మధ్య షోర్నూర్ వద్ద వందేభారత్ రైలు మూడు గంటల సేపు నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి మొరాయించడంతో రైలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణీకులు లోపలి చిక్కుకుని నానా యాతన పడ్డారు. తలుపులు మూసుకుపోవడం, లోపల ఎయిర్ కండిషనర్ పనిచేయకపోవడంతో ప్రయాణీకులు అల్లాడిపోయారు. 16 బోగీలున్న ఈ రైలును షోర్నూర్ రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చి ఇంజిన్ మార్చారు. దీని వల్ల ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. విమానాశ్రయానికి సకాలంలో చేరుకోలేక కొంత మంది ప్రయచాణాలు రద్దు చేసుకోవాల్సి వచ్చింది.

బుమ్రాకు అగ్రస్థానం

- జైస్వాల్, కోహ్లీ ర్యాంకులు పతనం
- ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టెస్ట్ ర్యాంకింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో నిలిచాడు. ఐసిసి బుధవారం వెల్లడించిన టెస్ట్ బౌలర్ల జాబితాలో బుమ్రా 883 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. ఇక టాప్-10 బౌలర్ల జాబితాలో రవిచంద్రన్ అశ్విన్(807) 4వ, రవీంద్ర జడేజా(794) 6వ స్థానంలో నిలిచారు. ఇక కుల్దీప్ యాదవ్(648) 19వ స్థానంలో నిలిచాడు. ఇక బ్యాటర్ల జాబితాలో ఆస్ట్రేలియాపై సెంచరీ కొట్టిన యశస్వీ జైస్వాల్‌తో పాటు విరాట్ కోహ్లీ ర్యాంకులు పతనమయ్యాయి. జైస్వాల్ రెండు ర్యాంక్‌లు పడిపోయి నాల్గో స్థానానికి చేరగా.. విరాట్ కోహ్లీ(689) 14వ స్థానానికి పడిపోయాడు. టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్(736) 6వ స్థానాన్ని సుస్థిరం చేసుకోగా.. శుభ్‌మన్ గిల్ టెస్టు బ్యాటర్ల జాబితాలో 18వ స్థానంలో ఉన్నాడు. అతడు ఖాతాలో 673పాయింట్లు ఉన్నాయి. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్(895పాయింట్లు) మరోసారి అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకోగా.. బ్రూక్(ఇంగ్లండ్) 854రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో, కేన్ విలియమ్సన్(న్యూజిలాండ్) 830రేటింగ్ పాయింట్లతో 3వ స్థానంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉండగా.. పెర్త్ వేదికగా జరిగిన తొలిటెస్ట్‌లో టీమిండియా 295 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక విరాట్ కోహ్లీ పెర్త్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. పెర్త్ టెస్టులో రిషబ్ పంత్ బ్యాట్ రాణించలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో 37 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం ఒక పరుగు మాత్రమే చేశాడు. అయితే, ర్యాంకింగ్‌లో ఎలాంటి ప్రభావం కనిపించలేదు. టెస్ట్ బ్యాటర్ల టాప్-10లో కేవలం పంత్, జైస్వాల్ మాత్రమే ఉన్నారు. ఆస్ట్రేలియాతో ఆడిన తొలిటెస్ట్‌లో బుమ్రా ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. ఈ టెస్ట్‌కు అశ్విన్‌కు విశ్రాంతినిచ్చినా అతడు నాలుగో స్థానంలో కొనసాగుతుండగా.. స్పిన్నర్ రవీంద్ర జడేజా ఒక స్థానం మెరుగుపరుచుకొన్నాడు. ఇక టెస్టుల్లో భారత్ 111పాయింట్లతో 2వ స్థానంలో కొనసాగుతోంది.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

ప్రతి ధాన్యం గింజా కొంటాం

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-చల్లపల్లి (కృష్ణా జిల్లా)

రైతుల అధైర్యపడొద్దని, ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు హామీ ఇచ్చారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలో తడిసిన వరి ధాన్యాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ చివరి గింజ వరకు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సేవా కేంద్రంలో తేమ శాతానికి, రైస్ మిల్లర్ల వద్ద తేమ శాతానికి వ్యత్యాసం ఉంటుందని తెలిపారు. రైతు సేవా కేంద్రంలో ఇచ్చిన తేమ శాతమే ప్రామాణికమని, మిల్లర్లు ఇబ్బంది పెడితే తెలియజేయాలని, వారిని బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోపే ప్రభుత్వం నుండి రైతు ఖాతాలో డబ్బులు జమ చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. 30 నుండి 40 రోజుల్లో జరగాల్సిన ప్రక్రియ మూడు రోజుల్లో జరగడంతో సంచులు, ట్రాన్స్‌పోర్ట్, మద్దతు ధర, నెంబర్ల విషయాల్లో కొంత ఇబ్బందులు జరిగాయని, వాటన్నిటిని సరిచేస్తామని చెప్పారు. అనంతరం మాజేరులో జాతీయ రహదారిపై రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని, రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని తెలిపారు.

సత్తా చాటిన వైభవ్ సూర్యవంశి

- యుఎఇపై గెలుపుతో సెమీస్‌కు భారత్
- అండర్-19 ఆసియాకప్



షార్జా: ఆసియాకప్ అండర్-19 క్రికెట్ టోర్నీలో భారత బ్యాటర్, 13ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సత్తా చాటాడు. యుఎఇ అండర్-19తో బుధవారం జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుఎఇ 44 ఓవర్లలో 137 పరుగులకే ఆలౌటైంది. రాయన్ అత్యధికంగా 35 పరుగులు చేశాడు. యుదజిత్ గుహకు మూడు, చేతన్ శర్మ.. హార్దిక్ రాజ్‌లు చెరి రెండు వికెట్లు పడగొట్టారు. 138 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా సునాయాసంగా ఛేదించింది. 16.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 143 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 13ఏళ్లకే ఐపిఎల్‌లో కోటి రూపాయల జాక్‌పాట్ కొట్టిన వైభవ్ సూర్యవంశీ(76), ఆయుష్ మాత్రే(67) పరుగులతో రాణించారు. వైభవ్ ఇన్నింగ్స్‌లో ఆరు సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి.

సెమీస్‌లో భారత్ × శ్రీలంక ఢీ

బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌తో ఆసియాకప్ అండర్-19 లీగ్ మ్యాచ్‌లు ముగిసాయి. గ్రూప్-ఎలో 2వ స్థానంలో నిలిచిన భారత్.. గ్రూప్-బిలో టాప్‌లో ఉన్న శ్రీలంకతో సెమీస్‌లో తలపడనుంది. లీగ్ దశలో భారత యువ జట్టు పాకిస్తాన్ చేతిలో ఓటమిపాలైంది. మరో సెమీస్ పాకిస్తాన్-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగనుంది. 6న సెమీఫైనల్స్, 8న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ...	మ్యా	గె	ఓ	నె.రన్‌రేట్	పా
పాకిస్తాన్	3	3	0	+1.94	6
ఇండియా	3	2	1	+2.55	4
యుఎఇ	3	1	2	+0.33	2
జపాన్	3	0	3	-4.42	0
గ్రూప్-బి...					
శ్రీలంక	3	3	0	+1.28	6
బంగ్లాదేశ్	3	2	1	+0.91	4
నేపాల్	3	1	2	-0.74	2
ఆఫ్ఘనిస్తాన్	3	0	3	-1.41	0



వరుసగా ఐదో గేమ్ డ్రా

ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

సింగపూర్: డి. గుకేశ్-డింగ్ లిరెన్‌ల మధ్య జరుగుతున్న ఫిడే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఎనిమిదో రౌండ్ గేమ్ డ్రా అయ్యింది. దీంతో వరుసగా ఐదో గేమ్ డ్రాతో ముగిసినట్లయ్యింది. బుధవారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో డి. గుకేశ్ నల్ల పావులతో, డింగ్ తెల్ల పావులతో గేమ్‌లు ఆడారు. లిరెన్ సి-4తో, గుకేశ్ ఇ-5తో గేమ్‌లను ప్రారంభించారు. ఎనిమిదోరౌండ్ గేమ్ కూడా డ్రా కావడంతో ఇరువురు గ్రాండ్‌మాస్టర్లకు అర పాయింట్ చొప్పున దక్కింది. ఈ గేమ్ సుమారు 51 ఎత్తుల సేపు సాగింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన చైనా గ్రాండ్‌మాస్టర్‌కు గుకేశ్ చెమటలు పట్టిస్తున్నాడు. ఎనిమిదోరౌండ్ గేమ్ ముగిసేసరికి ఇరువురు గ్రాండ్‌మాస్టర్లు 4పాయింట్లతో సమంగా ఉన్నారు.

పోరాడి ఓడిన టైటాన్స్

ప్రొ కబడ్డీ సీజన్-11

పూణే: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్ ఉత్కంఠ పోరులో ఓటమిపాలైంది. యుపి యోధాస్‌తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టైటాన్స్ 33-36పాయింట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. టైటాన్స్ జట్టులో విజయ్(11), మంజిత్(7), ఆశీశ్ నర్వాల్(4) రైడ్స్‌లో రాణించగా.. సాగర్ రావత్(2), అజిత్ పవార్(2) ట్యాకిల్స్‌లో రాణించారు. ఇక యుపి జట్టులో గగన్(15) రైడ్స్‌లో సత్తా చాటగా.. భవానీ రాజ్‌పుట్(6) రైడ్స్‌లో, హితేశ్(3) ట్యాకిల్స్‌లో మెరిసారు. టైటాన్స్ జట్టు 4సార్లు యుపిని ఆలౌట్ చేసినా.. రైడ్స్ ద్వారా కేవలం 19పాయింట్లు మాత్రమే సాధించగల్గింది. ఇక యుపి జట్టు 2సార్లు టైటాన్ జట్టును ఆలౌట్ చేసినా.. 24రైడ్ పాయింట్లు సాధించడం ఆ జట్టుకు కలిసొచ్చింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 39-32పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. తెలుగు టైటాన్స్ 16మ్యాచ్‌లు ముగిసే సరికి 9 విజయాలు, 7 పరాజయాలతో సహ 49పాయింట్లతో 4వ స్థానంలో కొనసాగుతోంది.



పాలస్తీనా నుంచి ఇజ్రాయిల్ వైదొలగాల్సిందే

- ఐరాస తీర్మానానికి భారత్ ఓటు
- స్వతంత్ర పాలస్తీనా ఆవిర్భావానికి మద్దతు
- అనుకూలంగా 157దేశాలు... అమెరికా సహా 8 దేశాలు వ్యతిరేకం

న్యూయార్క్ : తూర్పు జెరూసలేం సహా 1967 నుండి తన ఆక్రమణలో ఉన్న పాలస్తీనా భూభాగం నుండి ఇజ్రాయిల్ వైదొలగాల్సిందేనన్న డిమాండ్‌ను భారత్ సమర్ధించింది. దీనికి సంబంధించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి మన దేశం అనుకూలంగా ఓటేసింది. ఈ ఓటింగ్ మంగళవారం జరిగింది. ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య జరుగుతున్న ఘర్షణలపై అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చలో భాగంగానే ఐరాస జనరల్ అసెంబ్లీలో ఓటింగ్ నిర్వహించారు. 'పాలస్తీనా అంశానికి శాంతియుత పరిష్కారం' అనే శీర్షికతో రూపొందించిన ఈ తీర్మానాన్ని సెనెగల్ ప్రతిపాదించగా అత్యధికంగా సభ్య దేశాలు మద్దతు తెలిపాయి. పాలస్తీనా నుండి ఇజ్రాయిల్ వైదొలగాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భారత్ సహా 157 దేశాలు ఆమోదించాయి. తీర్మానాన్ని కేవలం ఎనిమిది దేశాలు...ఇజ్రాయిల్, అమెరికా, మైక్రోనేషియా, న్యూరా, పాలవ్, పపువా న్యూ గునియా, అర్జెంటీనా, హంగరీ మాత్రమే వ్యతిరేకించాయి. కామెరూన్, చెచియా, ఈక్వెడార్, జార్జియా, పరాగ్వే, ఉక్రెయిన్, ఉరుగ్వే సహ పలు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.



భారత్ వైఖరి ఇదే

ఈ తీర్మానాన్ని భారత్ బలపరచడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పాలస్తీనా విషయంలో దీర్ఘకాలంగా దేశం అనుసరిస్తూ వస్తున్న వైఖరిని ఇది ప్రతిబింబిస్తోంది. ఒకప్పటి మాండెటరీ పాలస్తీనా (1920–1948 మధ్యకాలంలో మనుగడలో ఉన్న భౌగోళిక రాజకీయ ప్రదేశం) భూభాగంలో రెండు దేశాలను ఏర్పాటు చేసి, తద్వారా ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణను నివారించవచ్చని ఉద్దేశించిన పరిష్కారానికి భారత్ ఎప్పటి నుండో మద్దతు ఇస్తోంది. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నామని ఈ ఓటింగ్ ద్వారా భారత్ పునరుద్ఘాటించింది. ఇజ్రాయిల్ దురాక్రమణను అంతం చేసి, స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయాలన్న ఐరాస పిలుపుతో ఏకీభవించింది.

తీర్మానంలో ఏముంది?

వివాదాస్పద తూర్పు జెరూసలేం సహా పాలస్తీనా ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయిల్ తక్షణమే వైదొలగాలని ఐరాస తీర్మానం డిమాండ్ చేసింది. పాలస్తీనా ప్రజల అవిభాజ్య హక్కులను ముఖ్యంగా వారి స్వీయ నిర్ణయాధికారాన్ని గుర్తించాలని, స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ చట్టానికి ముఖ్యంగా జులైలో అంతర్జాతీయ న్యాయస్థానం జారీ చేసిన సూచనలకు కట్టుబడి ఉండాలని ఈ తీర్మానం ఇజ్రాయిల్‌ను డిమాండ్ చేసింది. చట్టవిరుద్ధంగా ఆక్రమించుకున్న పాలస్తీనా భూభాగం నుండి వైదొలగాలని అంతర్జాతీయ న్యాయస్థానం సూచించింది. గాజాలో భౌగోళిక లేదా ప్రాదేశిక మార్పులు చేపట్టడాన్ని ఐరాస తీర్మానం తిరస్కరించింది. ఆ ప్రాంతం 1967లో ఆక్రమించుకున్న పాలస్తీనాలో భాగమేనని పునరుద్ఘాటించింది.

పాలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణను నివారించేందుకు ఐరాస చేసిన తీర్మానం ఇదే మొదటిది కాదు. దీర్ఘకాల సమస్యను పరిష్కరించడానికి జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలలో ఇది కూడా భాగమే. ఐరాస తీర్మానం ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాన్ని గురించి ప్రస్తావిస్తూనే విస్తృతమైన భౌగోళిక రాజకీయ అంశాలపై కూడా దృష్టి సారించింది. అయితే ఈ విషయంపై అంతర్జాతీయ సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పాలస్తీనాలో జరుగుతున్న పరిణామాలకు ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేయడాన్ని అమెరికా వంటి కొన్ని దేశాలు వ్యతిరేకిస్తున్నాయి.

గోలన్ హైట్స్‌పై తీర్మానానికి కూడా

పాలస్తీనా హక్కులకు మద్దతు ఇచ్చిన భారత్, ఆక్రమిత సిరియన్ గోలన్ హైట్స్ నుండి ఇజ్రాయిల్ వైదొలగాలన్న మరో ఐరాస తీర్మానాన్ని కూడా సమర్ధించింది. 1967 నుండి సిరియన్ గోలన్ హైట్స్‌లో ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ నిర్మాణాన్ని, ఇతర కార్యకలాపాలను భారత్ వ్యతిరేకిస్తూ అవి చట్టవిరుద్ధమని ఎత్తిచూపింది. ఈ తీర్మానాన్ని 97 దేశాలు సమర్ధించగా, 8 దేశాలు వ్యతిరేకించాయి. ఇజ్రాయిల్, బ్రిటన్, అమెరికా సహా 64 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గోలన్ హైట్స్‌లో ఇజ్రాయిల్ నిరంతర ఆక్రమణను తీర్మానం ఖండించింది. ఆ ప్రాంతంపై తన చట్టాలను, అధికారాలను రుద్దుతూ 1981లో ఇజ్రాయిల్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరింది.

రైల్వేను ప్రయివేటీకరించొద్దు

- లోక్‌సభలో నినదించిన ప్రతిపక్షాల సభ్యులు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రవేశపెట్టిన రైల్వే సవరణ బిల్లుపై చర్చ పూర్తయ్యింది. బిల్లుపై జరిగిన చర్చలో రైల్వేలను ప్రైవేటీకరణకు దూరంగా ఉంచాలని ప్రతిపక్ష ఎంపిలు కోరారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి నీరజ్ మౌర్య రైల్వేలను ప్రైవేటీకరణ చేతుల నుండి దూరంగా ఉంచాలన్న అభ్యర్థనను పునరుద్ఘాటించారు. దేశానికి రైల్వే జీవనాధారమని, రైల్వే బోర్డు నిర్ణయాధికారంలో స్వతంత్రంగా ఉండేందుకు అనుమతించాలని అన్నారు. చలికాలంలో పొగమంచు కారణంగా ప్రయాణాలలో జాప్యానికి సంబంధించిన సమస్యలను లేవనెత్తారు. కోవిడ్ సమయంలో అనేక రైళ్లు రద్దు చేశారని, వాటిలో చాలా వరకు పునఃప్రారంభించలేదని తెలిపారు. రైల్వే బోర్డు నిర్ణయాలపై ప్రభుత్వ జోక్యం కొనసాగుతుందా? అని శివసేన (యుబిటి) ఎంపి అరవింద్ సావంత్ ప్రశ్నించారు. రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణలో నిర్వాసితులకు పునరావాసం ఇంకా అందించలేదని అన్నారు. ప్రభుత్వం ఖాళీల భర్తీకి ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం ఎంపి అమ్రారామ్ కోరారు. ప్రస్తుతం జరుగుతున్నట్లుగానే రైల్వే ఉద్యోగులపై పనిభారం పడకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. లోకో పైలెట్‌లు, టికెట్ కలెక్టర్ (టిసి), టికెట్ ఎగ్జామినర్లు (టిఇ) సహా రైల్వేలోని ఉద్యోగులకు విశ్రాంతి, పనికోసం సరైన సమయం కల్పించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ప్రాజెక్టులు, మరమ్మతు పనులు పూర్తి కావడానికి నిర్ణీత తేదీ లేకుండా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. రైల్వే బోర్డులో షెడ్యూల్డ్ కులాలు, తెగల సభ్యులను చేర్చాలని సేలంపూర్ ఎంపి రామశంకర్ రాజ్‌భర్ కోరారు.

పంజాబ్‌లో కాల్పుల కలకలం

- శిరోమణి అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ బాదల్‌పై హత్యాయత్నం
- అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద ఘటన

చండీగఢ్ : పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ (ఎస్‌ఎడి) పార్టీ అధ్యక్షులు, ఆ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ ఘటనలో ఆయన తృటిలో తప్పించుకున్నారు. ఆయనకు ఎలాంటి గాయాలూ కాలేదు. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం వద్ద సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ 'శిక్ష' అనుభవిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇది ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థ మాజీ సభ్యుడి చర్యగా తెలుస్తున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సిక్కు మత పెద్దలు వేసిన శిక్షలో భాగంగా సుఖ్‌బీర్‌సింగ్ బుధవారం స్వర్ణదేవాలయం బయట 'సేవాదార్'గా డ్యూటీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా, ఆయన చక్రాల కుర్చీపై కూర్చొని మెడలో ఫలక, చేతిలో బల్లెంతో కాపలాదారుడిగా ఉన్నారు. ఆ సమయంలో ఒక వ్యక్తి.. సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌కు దగ్గరగా వచ్చి ఆయనపై కాల్పులు జరిపే ప్రయత్నం చేశాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించటంతో బాదల్ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. దుండగుడు పేల్చిన తూటా ఒకటి దగ్గరలో ఉన్న గోడలోకి దూసుకెళ్లింది. కాల్పులు జరిపిన వ్యక్తిని ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బికెఐ)కి చెందిన మాజీ సభ్యుడు నరైన్ సింగ్ చౌరా అని తెలుస్తున్నది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. పోలీసులు నిందితుడిని ఘటనా ప్రదేశం వద్దనే అరెస్టు చేశారు. ఆయన దగ్గర నుంచి ఆయుధాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాదల్ జెడ్ ప్లస్ భద్రతలో ఉన్నారనీ, ఆయనకు పంజాబ్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలు రక్షణ కల్పిస్తాయని పంజాబ్ శాంతి భద్రతల విభాగం ప్రత్యేక డిజిపి అర్పిత్ శుక్లా చెప్పారు. ఈ దాడిని పలు రాజకీయ పార్టీలు ఖండించాయి. భద్రతా లోపం కనినిస్తున్నదనీ, దీనిపై జ్యుడీషియల్ విచారణ జరపాలని ఎస్‌ఎడి అధికార ప్రతినిధి దల్జీత్ సింగ్ చీమా డిమాండ్ చేశారు.

మళ్లీ రోడ్డెక్కిన యుపి రైతులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాల్లోను రైతులకు తగు వాటా దక్కాలని, అంతకంటే తక్కువగా ఉండే ఏ ప్రతిపాదన రైతులకు ఆమోదయోగ్యం కాదంటూ హైపవర్ కమిటీ చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అవసరమైతే మళ్లీ ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. మహాపంచాయత్‌నుద్దేశించి ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, హన్నన్ మొల్లా మాట్లాడుతూ, దేశానికి తిండి పెట్టే రైతన్నను జైల్లో పెడతారా అంటూ యుపి ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతుల డిమాండ్ల సాధన కోసం రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్ఘాటించారు. ప్రస్తుతం పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్నందున తమ డిమాండ్లను గట్టిగా వినిపించడం కోసం యుపిలోని పల్లె పల్లె నుంచి వేలాది మంది రైతులు పార్లమెంటు మార్చ్‌కు భారీగా తరలివచ్చారు. ఎక్కడికక్కడ బారికేడ్లను పెట్టి అడ్డుకోవడానికి యత్నించిన భద్రతా దళాలతో వారు ఘర్షణకు దిగారు. ఢిల్లీకి వెళ్లకుండా మధ్యలో అడ్డుకోవడంతో రైతులు రాజధాని సరిహద్దుల్లో బైఠాయించాలని నిర్ణయించుకున్నారు.

ఎడిఎం అతుల్ కుమార్, యమునా అథారిటీ ఓఎస్‌డి శైలేంద్ర సింగ్, అదనపు పోలీసు కమిషనర్లు శివహర్మీనా, బబ్లూకుమార్ రైతులతో చర్చలు జరిపేందుకు బుధవారం మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో మహా పంచాయత్ స్థలానికి రాగా, రైతులు తమ సహచరులను బేషరతుగా జైలు నుంచి విడుదల చేసేంతవరకు ఎటువంటి చర్చలు ఉండవని స్పష్టం చేశారు. దీంతో సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రైతు నేతలు పవన్ ఖతానా, సుఖ్‌బీర్ ఖలీఫా, రూపేష్ వర్మ, సునీల్ ఫౌజీ, వికాస్ ప్రధాన్, అమన్ ఠాకూర్, బాబీ నగర్, సుభాష్ చౌదరిని జైలు నుంచి విడుదల చేశారు.

టికాయత్‌ను అడ్డుకోవడం దుర్మార్గం: ఎస్‌కెఎం

అరెస్టు చేసిన రైతులను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం విడుదలజేయడాన్ని నిరంకుశ పాలనపై ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా ఎస్‌కెఎం పేర్కొంది. నిర్బంధానికి వ్యతిరేకంగా యుపి రైతులు సాగించిన పోరాటం దేశవ్యాపితంగా ఉన్న రైతాంగానికి ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. మహాపంచాయత్‌కు రాకుండా ఎస్‌కెఎం నాయకుడు రాకేష్ టికాయత్‌ను అడ్డుకోవడాన్ని ఎస్‌కెఎం ఖండించింది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని వ్యాఖ్యానించింది. రాకేష్ టికాయత్‌ను నేరస్తుడిలా వేటాడి, నిర్బంధించడం దారుణమని విమర్శించింది.

అత్యంత విలువైన భూములను, బతుకు తెరువును కోల్పోయినవారి బాధలను పట్టించుకోకుండా పోలీసులనుపయోగించి బలప్రయోగం ద్వారా పరిష్కరించాలనుకోవడం అవివేకమని ఎస్‌కెఎం పేర్కొంది. దేశ రాజధాని పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం తమ నుంచి లాక్కున్న భూములకు తగు పరిహారం చెల్లించాలని, తమ కుటుంబాలకు మెరుగైన పునరావాస ప్యాకేజి ఇవ్వాలని కోరుతూ రైతుల ఉమ్మడి పోరాట వేదిక ఎస్‌కెఎం ఈ ఢిల్లీ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఎస్‌కెఎంలో ఎఐకెఎస్‌తో సహా పది రైతులు సంఘాలు భాగస్వాములుగా ఉన్నాయి. కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020–21 మధ్య నిర్వహించిన రైతుల చారిత్రాత్మక పోరాటానికి నాయకత్వం వహించిన ఎస్‌కెఎంలో ప్రధాన భాగస్వామ్య సంఘాలన్నీ యుపి ఎస్‌కెఎంలో ఉన్నాయి. యుపి రైతులు నిర్వహించిన ఈ ఆందోళన లక్ష్యాన్ని గురించి ఎఐకెఎస్ నాయకుడు పుష్పేంద్ర త్యాగి వీడియో సందేశం ద్వారా వివరిస్తూ, 2013 భూ సేకరణచట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నదే రైతుల ప్రధాన డిమాండని చెప్పారు. దీని కోసం గత కొన్ని నెలలుగా నొయిడాలో ఆందోళన చేస్తున్న రైతులు తమ న్యాయమైన డిమాండ్లపై పార్లమెంటు దృష్టి పెట్టేలా ఒత్తిడి తేవడం కోసం ఢిల్లీ మార్చ్ చేపట్టారని అన్నారు. డెవలప్ చేసిన ప్లాట్లలో కనీసం పది శాతం తమకు ఇవ్వాలని, భూ సేకరణలో పారదర్శకత, న్యాయమైన పరిహారం చెల్లింపునకు సంబంధించిన రైతుల హక్కును సరిగా అమలు చేయాలని వారు కోరుతున్నారని ఎఐకెఎస్ ఒక ప్రకటనలో పేర్కొంది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని, నొయిడా అభివృద్ధి కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు పునరావాసం కల్పించడంతో బాటు రైతులకు ఉద్యోగాలు ఇవ్వాలని కూడా రైతులు కోరుతున్నారు. 1970లలో ఢిల్లీ శివార్లలో ఏర్పడిన నొయిడా (న్యూ ఓఖ్యాల ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ) చేపట్టిన అంచెలంచెలుగా విస్తరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో స్థానిక రైతులు పెద్దయెత్తున తమ వ్యవసాయ భూములను కోల్పోయారు. ఈ భూ సేకరణలో చాలా మంది రైతులు తమ జీవనోపాధిని కోల్పోయారు. ఇచ్చిన అరకొర పరిహారం ఈ లోటును ఏమాత్రం భర్తీ చేయలేకపోయింది. దీంతో వారు పదే పదే రోడ్డెక్కాల్సి వస్తోంది. 2013 భూ సేకరణ చట్టం వచ్చాక తమ బాధలు కొంతమేరకైనా తీరుతాయని రైతులు భావించారు. కానీ, 2014లో యుపిలో బిజెపి ప్రభుత్వం ఈ చట్టంలోని నిబంధనలను వ్యతిరేకించింది. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పలు సవరణలను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం యత్నించింది. అయితే, రైతులు తిరగబడడంతో ఆ యత్నాలనుంచి వెనక్కి తగ్గింది. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయం చేకూర్చడంలో యుపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్‌కెఎం విమర్శించింది. గతంలో వలస పాలన కాలం నాటి చట్టాలను ఉపయోగించి రైతుల నుంచి బలవంతంగా సేకరించిన భూములకు పెద్దగా పరిహారం కూడా చెల్లించలేదని, దీనిపై రైతులు ఉద్యమించినప్పుడల్లా హామీలతో సరిపెడుతున్నదే తప్ప వాటిని ఆచరణలో పెట్టడం లేదని ఎఐకెఎస్ పేర్కొంది. రైతుల డిమాండ్లు పూర్తిగా నెరవేరేంతవరకు ఢిల్లీ సరిహద్దును వీడి వెళ్లరాదని రైతులు గట్టిగా నిర్ణయించుకున్నారని ఎఐకెఎస్ ప్రకటించింది.

కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించాలని, తిరోగమనంతో కూడిన నాలుగు కార్మిక చట్టాలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఎస్‌కెఎం , కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఇచ్చిన పిలుపు మేరకు నవంబరు26న దేశ వ్యాపితంగా నిరసన ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

దేవేంద్ర ఫడ్నవిస్‌కే పట్టం

- నేడు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం
- డిప్యూటీ సిఎంలుగా షిండే, అజిత్ పవార్

ముంబయి : మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై గత కొద్ది రోజులుగా నెలకొన్న అనిశ్చితికి ఎట్టకేలకు తెర పడింది. తదుపరి ముఖ్యమంత్రిగా బిజెపి సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవిస్ పేరును ఖరారు చేశారు. బుధవారం జరిగిన బిజెపి కోర్ కమిటీ సమావేశంలో బిజెపి శాసనసభా పక్ష నేతగా ఆయన ఎన్నికయ్యారు. ముంబయిలోని అజాద్ మైదానంలో గురువారం ఆయన నూతన ముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రమాణోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు ముఖ్యమంత్రులు, బిజెపి నేతలు హాజరుకానున్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి 230 స్థానాలతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. కూటమి నేతలతో కలిసి గవర్నరును కలిసిన అనంతరం ఫడ్నవీస్ మాట్లాడుతూ తన పేరును షిండే, పవారే ప్రతిపాదించారని తెలిపారు.

ముఖ్యమంత్రి లేదా డిప్యూటీ ముఖ్యమంత్రి అన్నవి కేవలం సాంకేతిక పదాలని, తామంతా ఐక్యంగా పని చేస్తామని తెలిపారు. ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ..రెండేళ్ల క్రిందట తాను ముఖ్యమంత్రి కావడానికి ఫడ్నవీస్ మద్దతిచ్చారని, ఇప్పుడు తాను ఫడ్నవీస్‌ను సిఎం కావడానికి మద్దతిచ్చానని తెలిపారు.

సంభాల్‌కు వెళ్ళకుండా రాహుల్‌ను అడ్డుకున్న యుపి పోలీసులు

ఘజియాబాద్ : సంభాల్‌కు వెళ్లేందుకు బయలుదేరిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని బుధవారం ఘజియాబాద్‌లోని ఘాజీపూర్ సరిహద్దుల వద్ద పోలీసులు నిలిపివేశారు. సంభాల్‌లో నిషేధాజ్ఞలు అమల్లో వున్నాయని, అందువల్లే ఆయనను అనుమతించలేదని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. కాగా ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రతిపక్ష నేతగా సంభాల్‌కు వెళ్ళడం నా హక్కు, బాధ్యత కూడా. కానీ వెళ్లకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. "అవసరమైతే ఒంటరిగా వెళ్ళడానికి కూడా సిద్ధమే. కానీ వారు దేనికీ అంగీకరించడం లేదు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకం. బిజెపి ఎందుకు భయపడుతోంది? అక్కడ తన వైఫల్యాలను దాచిపెట్టేందుకు పోలీసులను ఎందుకు ఉపయోగిస్తున్నారు? వాస్తవం, సోదర భావం సందేశాన్ని ఎందుకు అణచివేస్తున్నారు?" అని రాహుల్ ప్రశ్నించారు. పాలక బిజెపి ముందస్తు కుట్రతో సంభాల్ హింసకు పాల్పడిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది.

బుధవారం ఉదయం రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక గాంధీ, ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతలు ఘాజీపూర్ సరిహద్దులకు చేరుకున్నారు. అక్కడ భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించి వున్నాయి. సంభాల్‌లోకి వెళ్ళకుండా బారికేడ్లతో వారిని అడ్డుకున్నారు. సంభాల్‌లో నిషేధాజ్ఞలను ఈ నెల 31వరకు పొడిగించారు. ఢిల్లీ–సంభాల్ మార్గం పొడవునా వివిధ పాయింట్ల వద్ద యుపి పోలీసులు బారికేడ్లు పెట్టారు. ప్రతి చెక్‌పాయింట్ వద్ద వాహనాల తనిఖీ వుంది. దీంతో ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్ వేపై చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. జిల్లాలోకి ప్రవేశించడానికి ముందుగానే కాంగ్రెస్ నేతలను ఆపాలని పొరుగు జిల్లాలను సంభాల్ జిల్లా మేజిస్ట్రేట్ మంగళవారం కోరారు. సరిహద్దు వద్ద వారిని అడ్డుకోవాలని పోలీసు అధికారులకు లేఖ రాశారు.

అదాని, మోడీ ఒక్కటే

- పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాలు ఆందోళన

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

అంతర్జాతీయ న్యాయస్థానాల్లో ముడుపుల వ్యవహారంలో ఛార్జ్‌షీట్ ఎదుర్కొంటున్న గౌతం అదాని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఒక్కటేనని ప్రతిపక్షాలు విమర్శించాయి. బుధవారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద మోడీ.. అదాని ఒక్కటే అని, పక్కనే అదానితో ప్రధాని మోడీ చేతులు కలుపుతున్న ఫొటోతో కూడిన బ్యానర్‌తోపాటు ప్లకార్డులు చేబూని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. మోడీ సర్కార్, అదాని బంధానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాల హోరెత్తించారు. అదాని ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆప్, ఆర్‌జెడి, శివసేన (యుబిటి), డిఎంకె, ఎన్‌సిపి, జెఎంఎం, కేరళ కాంగ్రెస్, ఐయుఎంఎల్ సహా వివిధ పార్టీల ఎంపిలు ఆందోళనలో భాగస్వామ్యం అయ్యాయి.

ముఖద్వారం వద్ద ధర్నా చేయొద్దు : స్పీకరు

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. అనంతరం లోక్‌సభ ద్వారం వద్ద సభ్యులు గుమిగూడి ప్రదర్శనలు నిర్వహించవద్దని అన్నారు. వివిధ అంశాలపై ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసులను స్పీకర్ తిరస్కరించారు. అదాని నేరారోపణ అంశంపై బుధవారం పార్లమెంట్ ఆవరణలో పలు ఇండియా బ్లాక్ పార్టీల ఎంపిలు ఆందోళన చేశారు. పార్లమెంటు గేట్ల ముందు నిరసనలు చేయవద్దని లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి చర్యలు భద్రతపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.

ప్రతిపక్షాలు వాకౌట్

మరోవైపు రాహుల్ గాంధీ సంభాల్ పర్యటనపై లోక్‌సభలో దుమారం రేగింది. హింసాత్మక జిల్లా సంభాల్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పర్యటనపై తీవ్ర వాగ్వాదం తరువాత ప్రతిపక్ష సభ్యులు సభను వాకౌట్ చేశారు. రాహుల్ గాంధీ సంభాల్ పర్యటనపై కాంగ్రెస్ ఎంపి మహ్మద్ జావేద్ లేవనెత్తారు. ఈ సమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికార పార్టీ వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపిలు వాకౌట్ చేశారు.

ప్రతిపక్షాల పట్ల రాజ్యసభ ఛైర్మన్ రాజకీయ విమర్శలు

రాజ్యసభలో ప్రతిపక్షాలు రైతుల సమస్య, ఫెంగల్ తుపాను, అదాని గ్రూప్‌పై ఆరోపణలు, సంభాల్ అంశంపై రూల్ 267 కింద వాయిదా తీర్మానం ఇచ్చారు. వాటిని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. దీంతో రైతుల సమస్యలపై చర్చ జరపాలని, తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. కొంత మంది ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీనిపై ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై రాజకీయ విమర్శలు చేశారు. గతవారం రైతులకు నోటీసులు ఇవ్వలేదు కానీ ఇప్పుడు 'మొసలి కన్నీరు' కారుస్తున్నారని విమర్శించారు. ఆయన వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. 'మీరు మీ సీట్లకు వెళ్లకపోతే, ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు' అని ధన్‌ఖర్ అన్నారు. 'మీరు దానిని రాజకీయం చేస్తున్నారు, మీకు పరిష్కారం అక్కర్లేదు' ధన్‌ఖర్ ప్రతిపక్షాలను రాజకీయ నేతవలే విమర్శించారు. మొసలి కన్నీరుతో రైతుల ప్రయోజనాలు నెరవేరవు. మీరు దానిని రాజకీయం చేస్తున్నారు. మీకు పరిష్కారాలు అక్కర్లేదు. కిసాన్ (రైతులు) మీ చివరి ప్రాధాన్యత' అని ఆయన అన్నారు. 'నేను చాలా బలమైన వ్యాఖ్యలు చేస్తాను. మీరు డ్రామా సృష్టిస్తున్నారా? ఇది డ్రామా తప్ప మరొకటి కాదు' అని ధన్‌ఖర్ రెట్టింపు వ్యాఖ్యలు చేశారు. దీంతో నినాదాల హోరెత్తింది. సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

రాజ్యసభలో బాయిలర్ బిల్లు ఆమోదం

రాజ్యసభలో బుధవారం బాయిలర్స్ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. బాయిలర్స్ బిల్లులో పస లేదు అని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. ఈ బిల్లు కొత్త సీసాలో పాత వైన్ అని అన్నారు. ఈ బిల్లు రాష్ట్రాల అధికారాలను లాక్కోవడానికి ఉద్దేశించినదేనని విమర్శించారు. ఉదాహరణకు, బాయిలర్ ప్రమాదాలపై దర్యాప్తు చేయడానికి రాష్ట్రాలు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సవరించిన బిల్లు ఆదేశించిందని, శాంతిభద్రతలు రాష్ట్రానికి సంబంధించిన అంశమని ఆయన అన్నారు.

యూన్ తప్పుకో!

దక్షిణ కొరియాలో ఉవ్వెత్తున ఆందోళన

పార్లమెంటు తిరస్కరించడంతో సైనిక పాలన ఎత్తివేత

రాజీనామా చేస్తారా? అభిశంసించమంటారా?

అధ్యక్షుడికి ప్రతిపక్షం అల్టిమేటమ్



యూన్ తప్పుకోవాలంటూ సియోల్‌లో భారీ ర్యాలీ

సియోల్ : దేశంలో ఏకపక్షంగా సైనిక పాలన విధించి భంగపడ్డ దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ పదవికే ఇప్పుడు ఎసరొచ్చింది. ఆయన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. యూన్ తక్షణమే అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలంటూ రాజధాని సియోల్‌లోను, దేశంలోని ఇతర ప్రాంతాల్లోను ఉవ్వెత్తున ఆందోళనలు సాగుతున్నాయి. యూన్‌ను అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటారా? లేక అభిశంసన ఎదుర్కొంటారా? అని ప్రధాన ప్రతిపక్షమైన డెమొక్రాటిక్ పార్టీ నిలదీసింది. యూన్‌పై అభిశంసన తీర్మానానికి సంబంధించిన బిల్లును ఆరు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే పార్లమెంటుకు సమర్పించాయి.. దీనిపై గురు వారం లేదా శుక్రవారం ఓటింగ్ జరిగే అవకాశముంది. మంగళవారం ప్రకటించిన మార్షల్ లాను బుధవారం తెల్లవారు జామున దక్షిణ కొరియా ప్రభుత్వం ఎత్తివేసింది. పార్లమెంట్‌ను బలగాలు చుట్టుముట్టగా, మంగళవారం రాత్రంగా ఉద్రిక్తంగా రాజకీయ డ్రామా నడిచింది. చిట్టచివరకు మిలటరీ పాలనను తిరస్కరిస్తూ పార్లమెంట్ సభ్యులు ఓటు వేయడంతో ప్రజాస్వామ్యానికి తలెత్తిన ఒక పెద్ద ప్రమాదం తప్పిపోయింది. సైనిక పాలన ఎత్తివేస్తున్నట్లు అధ్యక్షుడు యూన్ బుధవారం తెల్లవారు జామున ప్రకటించారు.

ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రతిపక్షం పాల్పడుతోందని ఆరోపిస్తూ మంగళవారం పొద్దుపోయిన తర్వాత సైనిక పాలన విధిస్తూ యూన్ ఉత్తర్వులిచ్చారు. పార్లమెంటు తిరస్కరించడంతో ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. సైనిక పాలనకు వ్యతిరేకంగా అధ్యక్షుని సలహాదారులు, కార్యదర్శులు అందరూ కలిసి మూకుమ్మడిగా రాజీనామాలు చేయడానికి సిద్ధపడినట్లు అధ్యక్ష కార్యాలయం తెలిపింది. అధ్యక్షుడు తన చర్యలతో రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని స్పష్టమైందని డెమొక్రటిక్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. మార్షల్ లాను ప్రకటించే సమయంలో ఆయన ఏ నిబంధనలను పాటించలేదని పేర్కొంది. ఇది తిరుగుబాటు చర్య అని, అందువల్ల ఆయనను అభిశంసించడానికి తగిన ప్రాతిపదిక వుందని పార్టీ పేర్కొంది.

తయారీ రంగంలో ... చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగగలమా?

- అవకాశాలు తక్కువే : నీతి అయోగ్

న్యూఢిల్లీ : చైనా నుండి ఫ్యాక్టరీలను ఇతర దేశాలకు మార్చాలనుకునే కంపెనీలను మన దేశం ఆకర్షించగలదా? తయారీ రంగంలో చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగగలదా? ఈ ప్రశ్నలకు 'అవకాశాలు అంతంతమాత్రమే' అని నీతి అయోగ్ జవాబిచ్చింది. మానవ వనరులు ఎక్కువగా ఉండటం, తక్కువ వేతనానికే లభిస్తుండటంతో పాటు, పెద్ద ఎత్తున కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తుండటంతో పరిశ్రమలు భారీగా భారత్‌కు తరలివస్తాయంటూ నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కొంతకాలంగా ప్రచారం చేసుకుంటోంది. అలా వచ్చే వారికి భారీగా రాయితీలిస్తామని కూడా చెబుతోంది. కంపెనీలు తమ ఉత్పత్తి కార్యకలాపాలను చైనాకే పరిమితం చేయడం కాకుండా వివిధ ఇతరదేశాలకు విస్తరించడాన్ని 'చైనా+' వ్యూహంగా పిలుస్తున్నారు. ఒకే దేశంలో పూర్తిస్థాయిలో సరుకుల ఉత్పత్తి జరిగితే ఎదురయ్యే సమస్యలను అధిగమించడంతో పాటు, రాజకీయ కారణాలు వల్ల కూడా కంపెనీలో ఈ దిశలో నిర్ణయం తీసుకుంటున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం, ఆయన గత పాలనా కాలంలో చైనా ఉత్పత్తులను అడ్డుకోవడమే లక్ష్యంగా అనేక నిర్ణయాలను తీసుకుని ఉండటంతో కంపెనీలు అప్రమత్తమౌతున్నాయి. చైనానుండే వచ్చే దిగుమతులపై భారీ సుంకాలను విధిస్తామంటూ కొద్ది రోజుల క్రితం ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనాలోని అనేక కంపెనీలు తమ ఉత్పత్తి ప్రక్రియ నిరంతరాయంగా సాగేందుకు ఇతర దేశాల వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే నీతి అయోగ్ తాజాగా విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం దక్షిణాసియాలోని వియత్నాం, థాయ్‌ల్యాండ్, కంబోడియా, మలేషియా దేశాలతో పోలిస్తే ఆ కంపెనీలను ఆకర్షించే అవకాశం భారత్‌కు తక్కువగానే ఉంది. ఇప్పటికే ఈ దిశలో వచ్చిన అవకాశాలను ఆ దేశాలు పెద్ద ఎత్తున అందిపుచ్చుకున్నాయని పేర్కొంది.

మన దేశంతో పోలిస్తే ఆ దేశాలు స్వేచ్ఛా వాణిజ్య విధానాలను ఎక్కువగా అమలు చేస్తున్నాయని, అందువల్ల ఆ దేశాలే రేసులో ముందుటున్నాయని నీతి అయోగ్ తెలిపింది. బ్లూమ్‌బర్గ్ విడుదల చేసిన నివేదికలోనూ ఇటువంటి అభిప్రాయాలే వ్యక్తమయ్యాయి. ప్రాంతీయ ప్రత్యర్థులను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలని బ్లూమ్‌బర్గ్ సూచించింది. మరింతగా కార్పొరేట్ అనుకూల నిర్ణయాలకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగానే వరుసగా ఈ తరహా నివేదికలు విడుదలవుతున్నాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

'బియ్యం' చిచ్చు!

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు ఇటు జనసేనలో ఒక గ్రూపు నుంచి అటు టిడిపి నుంచి వస్తున్నాయి. మొత్తానికి బియ్యం అక్రమ రవాణా జనసేన ముఖ్య నేతల్లో తీవ్ర విభేదాలకు కారణమైందన్న వాదనలు బయలుదేరాయి.

వ్యూహాత్మకంగా 'దేశం' నేతలు

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాకు కొందరు టిడిపి మంత్రుల అండదండలున్నాయని సమాచారం. తమ వారిని రక్షించుకునేందుకు జనసేన మంత్రుల మధ్య నెలకొన్న విభేదాలను వ్యూహాత్మకంగా ఉపయోగపెట్టుకుంటున్నట్లు టిడిపి, జనసేన పార్టీల్లో చర్చించుకుంటున్నారు. అందుకే కేబినెట్ సబ్ కమిటీ సమీక్షలకే పరిమితమవుతోందని, ఇప్పటి వరకు ఎలాంటి నిర్దిష్ట చర్యలకు, దర్యాప్తునకు నిర్ణయాలు జరగలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, కొన్నేళ్లుగా కాకినాడ పోర్టును నడిపిస్తున్న ఓ వైసిపి కీలక నేత, ఆయన కుటుంబం జనసేన, టిడిపి ఎత్తులను తమకనుకూలంగా మార్చుకుంటున్నారని సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే రైస్ మిల్లర్ల, మాఫియా నెట్ వర్క్ చాలా మట్టుకు కూటమి కనుసన్నల్లోనే ఉందని, వాళ్లని వాళ్ల రక్షించుకునేందుకు ప్రయత్నిస్తారు కాబట్టి మధ్యలో తనకేం కాదని, తాను సులభంగా కేసుల నుంచి బయట పడవచ్చన్న ఆలోచనతో అందుకనుగుణంగా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది.



మీకోసం

కర్పూరాన్ని నువ్వుల నూనెలో కరిగించి తల, ఛాతీ, పాదాలకు మర్దన చేస్తే జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

చెట్టు ఎదగాలంటే వేర్లు దృఢంగా ఉండాలి. మనిషి ఎదగాలంటే సంకల్పం దృఢంగా ఉండాలి.

పరిహారం కోసం ఆడబిడ్డల వేలం!

అక్కడ.. ఆమెని సంతలో పశువుని అమ్మినట్లు అమ్మేస్తున్నారు. వేలం పేరుతో ఆమె గౌరవాన్ని అంగట్లో సరుకుని చేస్తున్నారు. ఆచారం పేరుతో సాగుతున్న ఈ దారుణంలో తండ్రే ఆమెని విక్రయానికి పెడతాడు. భర్త నుండి విడిపోవాలనుకున్నందుకు, అతనికి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించేందుకు ఆమె అమ్ముడవుతుంది. తండ్రి, భర్త, అత్తమామల సమక్షంలో అంగట్లో వస్తువులా ఆమెని కూర్చోబెడుతున్న ఈ ఆచారం మధ్యప్రదేశ్, రాజ్‌గఢ్ జిల్లాలో 'ఝుగ్గా నాత్రా'గా కొన్నేళ్లుగా యథేచ్ఛగా అమలవుతోంది.



కూతుళ్లని, కోడళ్ళని విక్రయానికి పెడుతున్న ఈ పంచాయతీ సమావేశాలని 'కూతుళ్ల మార్కెట్లు' అని పిలుస్తారు. ఈ విషయాల గురించి అక్కడి అధికారులకు, పాలకులకు తెలుసు. అయినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మనువాదం, సనాతనం తలకెక్కిన పెద్దలు ఆ ఆడపిల్లలకి భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు.

రాజ్‌గఢ్‌లో చాలా గ్రామాల్లో ఈ ఆచారం అమలవుతోంది. అక్కడ వేలం వేయబడ్డ, వేలానికి సిద్ధంగా ఉన్న అమ్మాయిలు ఉన్న కుటుంబాలే ఎక్కువ. అత్తింటి నుండి వచ్చేసిన కూతుర్లని వేలానికి పెట్టాల్సిన దుర్గతిలో ఎందరో తండ్రులున్నారు. భర్తల వేధింపుల నుండి కూతుళ్లని విముక్తి చేయాలంటే ఆచారం పేరుతో ఇళ్లు, పొలాలు అమ్ముకున్న పుట్టింటివారు అక్కడ ఎక్కడ చూసినా కనబడతారు.

ఏళ్ల తరబడి సాగుతున్న ఈ ఆచారంలో బలైన ఎందరో బాలికలు, యువతులు అక్కడ కోకొల్లలు. వేలానికి వెళ్లడం ఇష్టం లేక, డిమాండ్ చేసిన సొమ్ము ఇవ్వలేని ఆడపిల్లల కుటుంబాలు గ్రామాల్లో దోషులుగా చలామణి అవుతారు. పిల్ల అత్తింటి నుండి వేధింపులు, బెదిరింపులు వారిని ఊపిరితీసుకోనివ్వవు. చివరికి బలవంతంగానైనా సరే పంచాయతీకి వెళ్లాల్సిందే. ఆ ఇంటి పిల్ల వేలానికి కూర్చోవాల్సిందే.

'నేను వేలానికి వెళ్లను. అమ్ముడవ్వడం ఇష్టం లేదు' అంటున్న 24 ఏళ్ల కౌసల్య అక్కడే ఉంది. కొన్ని రోజుల్లో వేలానికి సిద్ధం కమ్మని, పంచాయతి పెద్దల నుండి ఆమెకి ఆదేశాలు వచ్చాయి. మరో ఇంట్లో భర్త నుండి విడిపోయిన 21 ఏళ్ల యువతి చదువుకోవాలని ఆశ పడుతోంది. కానీ ఆమె వేలంలో రూ.18 లక్షలకు అమ్ముడైపోయింది. ఈ వేలంతో అత్తింటివారు, పుట్టింటివారు చాలా సంతోషపడిపోయారు. కానీ అక్కడే, ఆ పెద్దలంతా నుంచొన్నచోటే ఆమె చదువు కోరిక భూస్థాపితమైపోయింది.

పోలీసులు, పాలకులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న ఈ వ్యవహారం ఏ సంస్కృతికి ఆనవాళ్లు..? మనువాదం, సనాతనం అంటూ గొప్పలు చెప్పే వాళ్లు ఈ కుసంస్కారంపై నోరు మెదుపుతారా?

ఈ తరహా సంఘటనలు వేలల్లో జరుగుతున్నా, పోలీసు స్టేషను వరకు వచ్చిన దాఖలాలు గతంలో ఎన్నడూ లేదు. ఈమధ్యే వెలుగులోకి వస్తున్నాయి. అయితే 2019 నుండి ఇప్పటి వరకు కేవలం వెయ్యి లోపు కేసులు నమోదు అయ్యాయి. దీంతో ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆచారం, పర్యావసనాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని మానవ హక్కుల కమిషన్ మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సందర్భం ఒకటి

చదువుకోవాలనుకుని కలలుగన్న చిన్నారికి యుక్త వయసు రాకుండానే ఓ తండ్రి పెళ్లిచేశాడు. అత్తారింటికి అడుగుపెట్టిన దగ్గర నుండి ఆ పసిది ఎన్నో చిత్రహింసలు పడింది. అక్కడ ఆమెని తిట్టారు, కొట్టారు, వాతలు పెట్టారు. బాధలు భరించలేక తను పుట్టింటికి వచ్చేసింది. ఆ బంధాన్ని తెంచుకోవాలని తల్లీదండ్రీ భావించారు. పరిహారంగా పెద్ద మొత్తం చెల్లించాలని భర్తింటి వారు డిమాండ్ చేశారు. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఆ తండ్రి, సంతకు పశువుని తీసుకెళ్లినట్లుగా బిడ్డని తీసుకుని పంచాయతీకి వెళ్లాడు. 'ఝుగ్గా నాత్రా'గా పిలవబడే ఆచారం అమలు చేసేందుకు అక్కడ పెద్దలందరూ సిద్ధంగా ఉన్నారు. వారంతా తనకి ధర నిర్ణయించారు. వేలానికి సిద్ధం చేసినట్లు ప్రకటించారు. ఇప్పుడు ఎవరు తనని వేలంలో కొనుక్కుంటారో వాళ్లు భర్తింటివారికి డబ్బులు చెల్లించాలి. ఇంతటితో ఆ వ్యవహారం ముగిసినట్లే.. అత్తింటికి న్యాయం జరిగి, పుట్టింటికీ భారం వీడి ఆ పిల్ల మరో ఇంటి గుమ్మంలో అడుగుపెడుతుంది. అక్కడా అలాంటి వేధింపులే ఎదురైతే.. ఆ పిల్ల ఎన్ని సార్లు వేలంలో కూర్చోవాలి? జవాబులేని ప్రశ్న ఇది..

సందర్భం రెండు

యుక్త వయసు వచ్చిన పిల్లకి పెళ్లి చేసి పంపించాడు తండ్రి. భర్త తాగుడికి బానిస. నిత్యం ఆమెకి నరకం చూపించాడు. కొన్ని నెలలు కూడా గడవకముందే తనని, తన తల్లీదండ్రిని బాగా చూసుకోవడం లేదని పుట్టింటికి పంపించేశాడు. విడాకులు ఇవ్వకుండా ఏళ్లకుఏళ్లు గడుపుతున్నాడు. విడాకులు కావాలంటే రూ.లక్షల్లో పెద్ద మొత్తం చెల్లించాలని యువతి తల్లిదండ్రులకు భర్త కండిషన్ పెట్టాడు. అంత సొమ్ము తండ్రి ఇవ్వలేడు. ఇరు పక్షాలు 'ఝుగ్గా నాత్రా'కి వెళ్లాలని నిర్ణయించుకున్నాయి. ఇప్పుడు తండ్రి, భర్త సమక్షంలో ఆమె వేలానికి సిద్ధమైంది.

సందర్భం 3

పెళ్లయిన ఏడాదికే భర్త చనిపోయాడు. ఆమె పుట్టింటికి వెళ్లానుకుంది. అత్తామామ ససేమిరా అన్నారు. ఎంతో పోరాడింది. 'చదువుకుంటాను. బతుకు బాగు చేసుకుంటాను' అని బతిమాలింది. మామ కనికరించాడు. అయితే ఓ కండిషన్ పెట్టాడు. 'ఝుగ్గా నాత్రా'కి సిద్ధం కమ్మన్నాడు. ఆమెకి మరో మార్గం లేదు. వేలానికి కూర్చొంది. ఎవరైనా పెద్ద మనసుతో ఆమెని కొనుక్కొని చదివిస్తారని ఆమె ఆశ. కానీ అక్కడ అంత విశాల హృదయులు ఎవరూ లేరు.

ఇక్కడే ఓ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. వేలం జరిగేటప్పుడు ఓ పోలీసు అధికారి అక్కడికి వచ్చాడు. తనకి న్యాయం జరుగుతుందని ఆమె భావించింది. కానీ, ఆ రక్షక భటుడు 'పిల్లని కోడలిగా కాదు.. కూతురుగా చూసుకోవాల'ని మామతో దేవుని ముందు ప్రమాణం చేయించి వదిలేశారు. అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించే అధికారం ఉన్నా అలా చేయలేదు. ఈ ఉదంతాన్ని ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అప్పటి నుండే ఆ ప్రాంతంలో జరిగే దారుణాలు వెలుగుచూశాయి.



రేపటి తరానికి వెలుగులం



పిల్లలం మేము మేటి పిల్లలం
రేపటి తరానికి వెలుగు రేఖలం
విజ్ఞానపు దారుల్లో పయనిస్తాం
అజ్ఞానం తొలగిస్తూ వెలుగుతాం

చాచా నెహ్రూ సన్నిధి విద్యార్థులం
చదువులోన రాణించే పౌరులం
సంస్కారమే మాకున్న స్నేహం
మమకారం రుచి చూసిన పిల్లలం

ఆటల్లో నేటి మేటి విజయులం
సమభావన గల మంచి మిత్రులం
గురువులంటే విలువనిచ్చె జ్ఞానులం
వారి పాదాలకు ప్రణమిల్లే యోగ్యులం

తల్లి తండ్రి ఆశయాన్ని నిలుపుతాం
వారి మాట జవదాటక అడుగేస్తాం
తోటి వారి మంచి కోరి కదులుతాం
లోకానికి మేలు చేస్తూ మసలుతాం

రేపటి పౌరులుగా ఎదుగుతాం
రేపటి తరం బాగుకై శ్రమిస్తాం
ఉత్తీర్ణత సాధిస్తూ ముందుకేగుతాం
ఉత్తమ విద్యార్థి దశకు చేరుతాం

టెక్నాలజీతోనే చేయి కలుపుతాం
టెక్నికల్‌గా ఎంతో విస్తరించుతాం
నేటివిటీ కాలంతో జతకట్టి నడుస్తాం
అంతా మంచే జరగాలని కోరుతాం

పాఠశాల శుభ్రతకే పట్టం గడతాం
పాఠాలను శ్రద్ధగా చదివి పాసవుతాం
పుస్తకాలపై మక్కువ పెంచుకుంటాం
విజ్ఞానానికి జోరుగా పదును పెడతాం


అక్షరక్షరం కలిపి వాక్యం నిర్మిస్తాం
పదం పదం కలిపి మంచి పాట రాస్తాం
నీతి కథలు చదివి చక్కగా జీవిస్తాం
బాలగేయాలతో ఉల్లాసం కలిగి వుంటాం

పొడుపు కథలు విప్పుతూ ఆనందిస్తాం
చరిత్ర చదివి లోకజ్ఞానం పొందుతాం
చక్కని మార్గంలో జీవితాన్ని నడుపుతాం

బుడుగులం మేము బుజ్జాయిలం
బుల్లి బుల్లి అడుగులేస్తూ కదుల్తాం
తీయని మాటలతో అలరిస్తూ వుంటాం
చదువులమ్మ సన్నిధిలో ఓలలాడుతాం

- నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన యాపిల్స్‌కి కొన్ని అంకెలు ఇచ్చాం. కింద వరుసల్లో ఉన్న యాపిల్స్ మధ్య ఉన్న గుర్తు ఆధారంగా వాటితో లెక్కచేయండి.

నేను గీసిన బొమ్మ





బనారి ధరహాస్,
6వ తరగతి,
కుకునూరు,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



వైభవంగా చైతన్య, శోభిత పెళ్లి

నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. బుధవారం (డిసెంబరు 4) రాత్రి 8.13 గంటలకు అన్నపూర్ణ స్టూడియోలో నాగేశ్వరరావు విగ్రహం ముందు వేసిన మండపంలో ఈ వివాహం జరిగింది. ఈ వేడుకకు అక్కినేని ఫ్యామిలీ, శోభితా కుటుంబ సభ్యులతో పాటుగా మరికొంతమంది హాజరయ్యారు. టాలీవుడ్ నుంచి పలువురు ప్రముఖులు వివాహానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బాలీవుడ్ మూవీలో అలీ

అలీ ప్రధాన పాత్రలో 'వెల్‌కమ్ టు ఆగ్రా' అనే హిందీ సినిమా రూపొందుతోంది. ఆశిష్ కుమార్ దూబే రచించి, దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్ ఫిలిమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమా ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి సన్నివేశాన్ని ముంబైలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ 'ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా కేంద్రంగా జరిగే ప్రేమకథే ఈ సినిమా. ఈ చిత్రంలో ప్రధాన పాత్రకి నన్ను ఎంచుకున్నందుకు దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. గతంలో హిందీలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేశాను. ఈ చిత్రంలో పూర్తి నిడివి ఉన్న పాత్ర చేస్తున్నాను. ఎంతో ఆనందంగా ఉంది' అని తెలిపారు. ఈ మూవీలో అన్షుమాన్ ఝా, సారా అంజలి, ఆకాశ్ ధబాడే నటిస్తున్నారు.

12,500 స్క్రీన్లలో 'పుష్ప 2'

పాన్ ఇండియా మూవీ 'పుష్ప 2' గురువారం నాడు విడుదల కానుంది. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సినిమా 'పుష్ప 2 ది రూల్'. 2021లో విడుదలైన బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పుష్ప' సినిమాకు ఇది సీక్వెల్. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.రవిశంకర్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో టాలీవుడ్ టాప్ హీరోయిన్ శ్రీలీల ఓ ప్రత్యేక పాటలో నటించారు. ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్లలో విడుదల చేస్తున్నారు. బుధవారం రాత్రే కొన్నిచోట్ల ప్రీమియర్ షోలకు తెలంగాణా ప్రభుత్వం అనుమతిచ్చింది. రాత్రి 9.30 గంటలకు హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌లో తన అభిమానులతో కలిసి అల్లు అర్జున్ సినిమాను తిలకించారు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే ఈ సినిమా రూ.100 కోట్లు పైబడి వసూళ్లు రాబట్టింది. అమెరికాలో కూడా అప్పటికే 3 మిలియన్ డాలర్లు వసూలు చేసింది.



'డాకు మహారాజ్' షూటింగ్ పూర్తి



బాలకృష్ణ నటిస్తోన్న 'డాకు మహారాజ్' షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు ప్రకటించారు. 'డాకు ఇన్ యాక్షన్' పేరుతో చిత్రీకరణ సమయంలోని ఒక ఫొటోని విడుదల చేశారు. బాబీ కొల్లి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్‌గా నిరంజన్ దేవరమానే వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం 2025, జనవరి 12న విడుదల కానుంది.

హర్మన్‌కు కఠిన పరీక్ష

- **నేడు భారత్-ఆస్ట్రేలియా తొలి వన్డే**
- **ఉదయం 9.50గం॥ల నుంచి**



బ్రిస్బేన్: వచ్చే ఏడాది జరగనున్న ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే ముందు భారత మహిళలజట్టు పటిష్ట ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. బ్రిస్బేన్ వేదికగా గురువారం నుంచి భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఐసిసి టి20 ప్రపంచకప్ ముగిసిన అనంతరం స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకున్న ఉత్సాహంతో ఈ పర్యటనకు హర్మన్‌ప్రీత్ సేన సిద్ధమైంది. ఇక ఆస్ట్రేలియా జట్టు వరుసగా 16 వన్డేల్లో విజయాల రికార్డును మరింత పటిష్టం చేసుకొనే ప్రయత్నంలో ఉంది. భారతజట్టు ఇప్పటివరకు ఆస్ట్రేలియాపై కేవలం నాలుగు వన్డేల్లో మాత్రమే విజయాలను నమోదు చేసుకోగా.. చివరిసారిగా 2021లో ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 1-2తో కోల్పోయింది. ఈ ఏడాది మార్చి తర్వాత ఆసీస్ మహిళల జట్టు తొలిసారి వన్డే సిరీస్‌లో పాల్గొనుంది. రెగ్యులర్ కెప్టెన్ అలైసా హీలీ మోచేతి గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరం కాగా.. తాహియా మెక్ గ్రాత్ సారథ్యంలో ఆసీస్ బరిలోకి దిగుతోంది. భారతజట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన చివరి ఆరు వన్డేల్లో 75యావరేజ్‌తో ఏకంగా 448పరుగులు చేసి అద్భుత ఫామ్‌లో ఉంది. ఈ ఏడాది జరిగిన ఐసిసి టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్‌కు చేరడంలో విఫలం కావడంతో హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ఆసీస్‌తో జరిగిన చివరి రెండు వన్డేల్లో హర్మన్ రెండంకెల స్కోర్ చేయడంలో విఫలమై తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రాణిస్తే భారత్ భారీస్కోర్ నమోదు చేయడం ఖాయం. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో గాయపడ్డ వికెట్ కీపర్ యాస్టికా భాటియా లేకుండానే భారత్ బరిలోకి దిగుతోంది. ఆమె స్థానంలో ఉమా ఛెత్రీ టీమిండియా జట్టులో తొలిసారి చోటు దక్కించుకుంది. స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిచా ఘోష్ తిరిగి జట్టులో చోటు దక్కించుకోగా.. హర్లిన్ డియోల్, మిన్ను మణికి తొలి వన్డేలో చోటు దక్కడం ఖాయం. తొలి వన్డే జరిగే బ్రిస్బేన్‌లో వాతావరం వేడి, తేమతో పాటు తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ వెల్లడించింది. 8న రెండో, 11న మూడో వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి.

జట్లు...

ఇండియా: హర్మన్‌ప్రీత్(కెప్టెన్), మంధాన(వైస్ కెప్టెన్), ప్రియ పునియా, రోడ్రిగ్స్, హెర్లిన్, ఉమా ఛెత్రి, రిచా(వికెట్ కీపర్), తేజల్, దీప్తి, మిన్ను మణి, ప్రియా, రాధా, టిటాస్, అరుంధతి, రేణుక, సైమా.

ఆస్ట్రేలియా: తానియా(కెప్టెన్), గార్డినర్(వైస్ కెప్టెన్), బ్రౌన్, కిమ్ గరాత్, కింగ్, లిచ్‌ఫీల్డ్, సోఫియా, మూనీ, పెర్రీ, స్కట్స్, సథర్లాండ్, జార్జియా వోల్, వారేహామ్.

రాష్ట్ర జట్లకు ప్రభుత్వం సహకారం అందించాలి

- **సిఎంతో చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వండి**
- **ఒలింపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం**

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే 38వ జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు ప్రభుత్వ సహకారంపై చర్చించేందుకు సిఎం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఎపిఒఎ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం కోరారు. పురుషోత్తం అధ్యక్షతన బుధవారం విజయవాడలో ప్రత్యేక సమావేశం జరిగింది. డెహ్రాడూన్‌లో జరిగే 38వ జాతీయ క్రీడల సన్నాహకాలపై ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డిసెంబరు నెలాఖరులోగానీ, జనవరి మొదటి వారంలోగానీ పోటీల్లో పాల్గొనే టీమ్‌లను ఖరారు చేస్తామని చెప్పారు. జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు చెఫ్ డి-మిషన్‌గా ఎపిఒఎ ఉపాధ్యక్షులు బడేటి వెంకట్రామయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో కోచ్‌లు, మేనేజర్లు, టెక్నికల్ అధికారులతో సహా 220 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర కంటింజెంట్ పాల్గొంటుందని చెప్పారు. జాతీయ క్రీడల్లో రాష్ట్ర జట్ల భాగస్వామ్యానికి సంబంధించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నేటి వరకు ఒలింపిక్ సంఘంతోగానీ, రాష్ట్ర క్రీడా సంఘాలతోగానీ ఒక్క సమావేశాన్ని కూడా నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ ఒలింపిక్ సంఘం తమను గుర్తించినప్పటికీ, శాప్ తమతో ఎలాంటి సమావేశాలూ నిర్వహించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు ప్రభుత్వ సహకారంపై చర్చించేందుకు సిఎం అపాయింట్‌మెంట్ కోరుతున్నట్లు తెలిపారు. ఒలింపిక్ సంఘానికి ప్రభుత్వం మద్దతు ఇవ్వకపోతే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లోగో లేకుండానే రాష్ట్ర జట్లు జాతీయ క్రీడల్లో పాల్గొంటాయని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఎపిఒఎ సిఇఒ గోవిందరాజు, ఉపాధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి శ్రీనివాస్, మహిళా ప్రతినిధి పద్మజాబాలా పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68